aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people.
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
శుక్రవారం
24-04-2026 సంపుటి : 01 సంచిక :33 పేజీలు : 08 వెల :₹ 5/-
తెలుగు దినపత్రిక

BESQATI
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com



## ఇరాన్ నౌకలను కాల్చిపారేయండి

- హోర్ముజ్‌పై ట్రంప్ కీలక ఆదేశాలు
- నిర్బంధించినంత వరకూ తెరిచేది లేదు : ఇరాన్
- యుద్ధంతో పతనం దిశగా ఆర్థికవ్యవస్థ
- ఎస్‌పీ గ్లోబల్ పర్చేజింగ్ సంస్థ వెల్లడి


**వాషింగ్టన్ : ఏప్రిల్ 23 (మహాప్రభ )**
అమెరికా, ఇరన్‌ల మధ్య కాల్పుల విరమణ అమల్లోనే ఉన్నా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక ఆదేశాలు జారీ చేశారు. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ నౌకలు మందుపాతరలు (సిమైన్స్) అమర్చుతున్నాయని, వాటిని గుర్తించి దాడి చేయాలని అమెరికా నౌకాదళాన్ని ఆయన ఆదేశించారు. ఈ మేరకు సోషల్ ట్రూత్‌లో పోస్ట్‌చేశారు. 'హర్మ్యుజ్ జలసంధిలో మైన్లను పెడుతున్న ఏ చిన్న పడవైనా సరే కాల్చి ధ్వంసం చేయాలని నావికా దళాన్ని ఆదేశించాను. ఈ విషయంలో ఏమాత్రం సంకోచించొద్దని చెప్పా. అమెరికా మైన్ స్వీపర్లు ప్రస్తుతం జలసంధిని క్లియర్ చేస్తున్నాయి. ఈ కార్యాచరణను మూడు రెట్లు అధిక వేగంతో కొనసాగించాలని ఆదేశిస్తున్నాను'' అని పేర్కొన్నారు. అంతేకాకుండా హోర్మ్యాజ్ జలసంధి తమ ఆధీనంలోనే ఉందని ప్రకటించారు. నౌకల రాకపోకలు అమెరికా నేవీ అనుమతితోనే జరుగుతాయని ట్రంప్ రాసుకొచ్చారు. ఇరాన్ ప్రస్తుతం తమ నాయకుడు ఎవరో తేల్చుకొనేందుకు తీవ్ర ఇబ్బంది పడుతోంద న్నారు. అమెరికా నేవీ అనుమతి లేకుండా నౌకల రాకపోకలు జరగవన్నారు. ఇరాన్ తమతో ఒప్పందానికి వచ్చేంతవరకు నిర్బందం కొనసాగుతుందని తెలిపారు అయితే కొద్దిరోజుల క్రితం ఆయనే స్వయంగా కాల్పుల విరమణను పొడిగిస్తూ ప్రకటించిన సంగతి తెలిసిందే.

-మిగతా 3 లో

# పోటెత్తిన ఓటర్లు

## రికార్డ్ స్థాయిలో పోలింగ్

- 90శాతం కొట్టిన బెంగాల్ ఓటర్లు.. తమిళనాడులో 82 శాతం..
- సాయంత్రం 5 గంటలకు క్యూ లైన్లలో భారీగా ఉన్న ఓటర్లు..
- ఉదయం 7 గంటలకే ప్రారంభమైన పోలింగ్
- ఎండను సైతం లెక్క చేయకుండా భారీ సంఖ్యలో ఓటర్లు
- తొలి గంటల్లోనే ఓటు హక్కును వినియోగించుకున్న పలువురు ప్రముఖులు




**కోల్‌కతా :ఏప్రిల్ 23 (మహాప్రభ )**
పశ్చిమ బెంగాల్‌లో తొలి విడత పోలింగ్ భారీ రికార్డుల్ని క్రియేట్ చేస్తోంది. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఓటర్లు పోలింగ్ సెంటర్ల ముందు బారులు తీరారు. సాయంత్రం 5 గంటల వరకు బెంగాల్‌లో 90 శాతం (89.93%) ఓటింగ్ నమోదైంది. చాలా మంది ఇంకా క్యూ లైన్లలో నిలిచి ఉండటంతో ఈ పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. తొలి విడతలో భాగంగా బెంగాల్‌లో 152 స్థానాలకు గురువారం ఓటింగ్ జరిగింది.

-మిగతా 3 లో



## కాళేశ్వరంపై రెండో రోజూ సంబురాలు..

- హైకోర్టు తీర్పుతో ఆనందోత్సాహాలు
- పటాకులు కాల్చిన బీఆర్ఎస్ శ్రేణులు
- పలుచోట్ల క్షీరాభిషేకాలు, జలాభిషేకాలు

**హైదరాబాద్ ఏప్రిల్ 23 (మహాప్రభ )**
కాళేశ్వరంపై జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక చెల్లదని హైకోర్టు సంచలన తీర్పునివ్వడంతో రెండో రోజైన గురువారం కూడా రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నాయి. ఈ సందర్భంగా పటాకులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. కేకులు కట్ చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం, జలాభిషేకాలు నిర్వహించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని చౌరస్తా వద్ద కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి క్షీరాభిషేకం చేశారు. నారాయణపేట జిల్లా

-మిగతా 3 లో

## ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే
# మాకు ముఖ్యం

### క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోవద్దు

- సీఎం రేవంత్ నేతృత్వంలోని క్యాబినెట్ భేటీ
- వివరాలు వెల్లడించిన మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు
- ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులతో నేడు డిప్యూటీ సీఎం నేతృత్వంలో చర్చలు
- పలు సూచనలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- కాళేశ్వరం తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని క్యాబినెట్ నిర్ణయం

**హైదరాబాద్,ఏప్రిల్ 23 (మహాప్రభ )**
ఆర్టీసీ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు మంత్రివర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి తెలిపారని.. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సుదీర్ఘ క్యాబినెట్ సమావేశం తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు కీలక విజ్ఞప్తి చేశారు. కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రభుత్వం పూర్తిగా సానుకూలంగా ఉన్నామని వివరించారు. ఉద్యోగ భద్రతపై ఎలాంటి అపోహలు వద్దని, ఒక్క ఉద్యోగిని కూడా ప్రభుత్వం తొలగించబోదని స్పష్టం చేశారు.

-మిగతా 3 లో





## బెంగాల్లో ఇక అధికారం బిజెపిదే

- మే 5న దీదీ ఆట ముగుస్తుంది
- భాజపా ప్రభుత్వం పూర్తి మెజార్టీతో ఏర్పాటవుతుంది.
- చొరబాట్లను పూర్తిగా నిరోధిస్తాం
- ఎన్నికల ప్రచారంలో అమిత్ షా కీలక వ్యాఖ్యలు

**కోల్‌కతా ఏప్రిల్ 23 (మహాప్రభ )**
పశ్చిమ బెంగాల్‌లో ఈసారి అధికారం భాజపాదేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు. తొలి విడత పోలింగ్ ముగుస్తున్న తరుణంలో బెంగాల్‌లో తాము పూర్తి మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం రాగానే చొరబాట్లను పూర్తిగా కట్టడి చేస్తామని అన్నారు. ఇంతకాలం మమతా బెనర్జీ చొరబాట్లను ప్రోత్సహిస్తూ దేశ బవిష్యత్‌కు సవాల్ విసిరారని మండిపడ్డారు. హుగ్లీ జిల్లాలోని బాలాగఢ్‌లో ఏర్పాటు చేసిన రెండో విడత ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. మే 5న దీదీ ఆట ముగుస్తుంది. భాజపా ప్రభుత్వం పూర్తి మెజార్టీతో ఏర్పాటవుతుంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, భద్రతకు చొరబాటుదారులు హాని కలిగిస్తున్నారు. బెంగాల్ యువత ఉద్యోగాలు, పేదల రేషన్‌ను దోపిడీ చేయడంతో పాటు దేశ భద్రతను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఏప్రిల్ 29న (రెండో విడత ఎన్నికల్లో)

-మిగతా 3 లో

## రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె

- ఎక్కడిక్కడే నిలిచిపోయిన బస్సులు
- బలవంతంగా నడడిపేందుకు యత్నాలు
- పలుచోట్ల కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**హైదరాబాద్ ఏప్రిల్ 23 (మహాప్రభ )**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు నానా యాతన పడుతున్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఆర్టీసీ కార్మికులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. పోలీసుల పహారాలో బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి బలవంతంగా బస్సులను నడుపాలని చూస్తున్నది. అయినప్పటికీ ఆర్టీసీ కార్మికులు

-మిగతా 3 లో

## నేటినుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

- తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం
- ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి

3 లో



## వాంఖడేలో సీఎస్కే విజయ గర్జన..

- సొంతగడ్డపై ముంబైకి అవమానకర ఓటమి..!
- 103 రన్స్ తేడాతో ముంబై చిత్తు
- 5వ ప్లేసుకు దూసుకెళ్లిన సీఎస్కే



**న్యూఢిల్లీ ఏప్రిల్ 23 (మహాప్రభ )**
ఐదుసార్లు ఛాంపియన్లు ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచులో సీఎస్కే ఘన విజయం సాధించింది. ముంబైలోని వాంఖడే క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగ్గా.. బ్యాటింగ్, బౌలింగ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ అదరగొట్టింది. ఈ సీజన్‌లో పేలవ ప్రదర్శన చేస్తున్న ఆ జట్టు.. కీలక మ్యాచులో సత్తాచాటింది. తొలుత బ్యాటింగ్ చేసి 6 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. అనంతరం ముంబైని 104 పరుగులకే కుప్పకూల్చి.. భారీ విజయం సాధించింది. రెండు పాయింట్లతో పాటు భారీగా నెట్ రన్ రేట్‌ను మెరుగుపర్చుకుంది.టార్గెట్ 208 ఉన్నప్పటికీ ఆడేది.. వాంఖడేలో కాబట్టి ముంబై ఇండియన్స్ విజయంపై ధీమాగానే ఉంది. కానీ ఇన్నింగ్స్

-మిగతా 3 లో

## తన గూడు తానే నిర్మించుకునే కప్ప




### అరుణాచల్‌లో సరికొత్త కప్ప జాతి

**న్యూఢిల్లీ: ఏప్రిల్ 23 (మహాప్రభ )**
తన ఇంటిని తానే నిర్మించుకోగల అరుదైన, సరికొత్త కప్ప జాతిని అరుణాచల్ ప్రదేశ్‌లో సైంటిస్టులు కనుగొన్నారు. ఇక్కడి నామ్‌దఫా టైగర్ రిజర్వ్‌లో 'లిమ్నోనెక్టెస్ మోతీజీల్' అనే అరుదైన, కోరలున్న కప్పను గుర్తించారు. ఈ జాతి కప్పలు భూమి లోపల గూళ్లు కట్టుకుంటాయి.

-మిగతా 3 లో

## కుబేర భారతం

- ఐదేండ్లలో 313 బిలియనీర్లకు చేరొచ్చు
- పస్తుతం 207 మంది సంపన్నులు
- నైట్‌ఫ్రాంక్ రిపోర్ట్ విడుదల



**న్యూఢిల్లీ ఏప్రిల్ 23 (మహాప్రభ )**
దేశంలో అధిక ధరలతో సామాన్యుల ఆదాయాలు హరించుకుపోతుంటే.. మరోవైపు అపర కోటీశ్వరులు భారీగా పెరుగుతున్నారు. ప్రపంచవ్యా ప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, వడ్డీరేట్ల పెంపు భయాలు, ఆర్థిక అసమానతలు ఉన్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా సంపన్నులు అమాంత పెరుగుతున్నారని అంతర్జాతీయ ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ తాజాగా ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఈ రిపోర్ట్ ప్రకారం..

-మిగతా 3 లో

## బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాదే విజయం

- మే4న రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతాం
- ప్రశాంత వాతారణంలో ఎన్నికలు జరగడం విశేషం
- నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



**కోల్‌కతా, ఏప్రిల్ 23 (మహాప్రభ )**
బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తప్పకుండా విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గతంలో మనం చూసుకుంటే భారీగా ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో భాజపా ఘన విజయం సాధించింది. బెంగాల్‌లో కూడా మే 4న భాజపా చరిత్ర సృష్టించనుంది. ఆ తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందాం. దాంతో పాటు ఝూల్‌ముఢీ కూడా పంచుతాం. ఈ మధ్యే నేను విన్నాను. ఝూల్‌ముఢీ కొందరికి షాక్ కొట్టించింది. అది నేను తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అయిదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ఈ ఎన్నికల్లో మాత్రమే హింస తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామం అన్నారు. పశ్చిబెంగాల్ లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కి ఝుల్మురి భయంకరమైన

-మిగతా 3 లో

# జన్మతహ పౌరసత్వం..
# ఇండియా, చైనాను తప్పుపట్టిన ట్రంప్

**వాషింగ్టన్: ఏప్రిల్ 23 (మహాప్రభ )**
ఇండియా, చైనా దేశాలను నరకకూపాలతో పోల్చారు అమెరికా రేడియో హోస్ట్ మైఖేల్ సావేజ్. ఆయన రాసిన ఓ లేఖను అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన ట్రుత్ సోషల్ పోస్టులో షేర్ చేశారు. సావేజ్ నేషన్ పేరుతో ఉన్న ఓ వీడియోను కూడా ఆయన తన పోస్టులో పెట్టారు. జన్మహక్కు పౌరసత్వం గురించి మైఖేల్ సావేజ్ చేసిన వ్యాఖ్యలను ట్రంప్ సమర్థిస్తూ ఆ పోస్టు చేశారు. ఇండియా, చైనా దేశాలు నరకకూపాలు అంటూనే.. ఆ రెండు ఆసియా దేశాల నుంచి వచ్చే ప్రజలు.. అమెరికాలో 9 నెలల్లో ఓ బిడ్డను వదిలేస్తారని, ఇక చట్టం ప్రకారం వాళ్లు తక్షణమే అమెరికా పౌరులు అవుతారని సావేజ్ తన లేఖలో విమర్శించారు. ఆ వర్ణవివక్ష లేఖను ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో షేర్ చేయడం



వివాదాస్పదం అవుతున్నది. ఇమ్మిగ్రేషన్ విధానాన్ని తప్పుపడుతూ మైఖేల్ సావేజ్ తన లేఖలో రాశారు. జన్మతహ పౌరసత్వం అంశంపై ప్రస్తుతం అమెరికాలో తీవ్ర చర్చ జరుగుతోంది. సుప్రీంకోర్టులో ఆ కేసుపై విచారణ కూడా జరుగుతున్నది. వలసదారులు(ఇమ్మిగ్రాంట్స్) జన్మతహ పౌరసత్వ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారని సావేజ్ తన లేఖలో ఆరోపించారు. నేరుగా ఆయన భారత్ దేశాన్ని ప్రస్తావించారు. అమెరికాలో స్థిరపడేందుకు కొన్ని కుటుంబాలు పౌరసత్వం మార్గాన్ని వాడుతున్నాయన్నారు. బేబీని డ్రాప్ చేసేందుకు అమెరికా వస్తారని, పిల్లోడు పుట్టిన తర్వాత ఇక చైనా లేదా ఇండియానో ఇక ఏదో నరకం నుంచి మొత్తం కుటుంబం వచ్చేస్తుందని అన్నారు. ఉద్యోగం కావాలంటే నువ్వు ఇండియానో లేక చైనావాడివై ఉండాలని, ఎందుకంటే అంతర్గత మెకానిజం మొత్తం ఇండియన్లు, చైనీయులతో నిండి ఉంటుందని సావేజ్ తన లేఖలో రాశారు. అయితే ఆ లేఖను ట్రంప్ షేర్ చేయడం.. ప్రత్యక్షంగా ఇండియా, చైనాను తప్పుపట్టినట్లుగా ఉంది.

# కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు షాక్..

**కోర్టు కార్యకలాపాల వీడియోలు పోస్ట్ చేసిన అంశంపై నోటీసులు**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 23 (మహాప్రభ )**
ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు షాకిచ్చింది. కోర్టు ప్రొసీడింగ్స్‌కు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసినందుకు కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం అంటే కోర్టు నియమాల ఉల్లంఘనే అంటూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. జస్టిస్ వి కామేశ్వర్ రావు, జస్టిస్ మన్‌మీత్ అరోరా ఆధ్వర్యంలోని బెంచ్ ఈ కేసును విచారిస్తూ, గురువారం నోటీసులు జారీ చేశారు. అంతేకాదు..



దీనికి సంబంధించిన వీడియోలను సోషల్ మీడియా సహా అన్నిరకాల ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, గూగుల్ వంటి సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించిన అన్ని వీడియోలను తొలగించాలని ఆదేశించింది. ఇది ఢిల్లీ లిక్కర్ కేసుకు సంబంధించిన అంశం విచారణ సందర్భంగా జరిగింది. ఈ కేసుకు సంబంధించి జడ్జిని మార్చాలని కోరుతూ కోర్టులో కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా కేజ్రీవాల్ స్వయంగా విచారణకు హాజరై, నేరుగా జస్టిస్ స్వర్ణ కాంత శర్మతో తన వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా చిత్రీకరించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇలా వీడియోలు వ్యాప్తి చెందడం కోర్టులు, న్యాయవ్యవస్థ గౌరవాన్ని తగ్గించడమే అని కోర్టు అభిప్రాయపడింది. ఈ వీడియోలను పోస్ట్ చేసిన జర్నలిస్ట్ రవిష్ కుమార్, ఇతర వ్యక్తులకు కూడా కోర్టు నోటీసులు జారీ చేసింది.

# ముస్లిం అనుకుని సిక్కు మహిళను రేప్

**యూకే కోర్టులో అంగీకరించిన నిందితుడు**

**లండన్ ఏప్రిల్ 23 (మహాప్రభ )**
బ్రిటన్‌కు చెందిన 32 ఏళ్ల జాన్ ఆష్బీ.. 2025లో ఓ మహిళను రేప్ చేశాడు. అయితే ఆమె ముస్లిం మతానికి చెందిన వ్యక్తి అనుకుని .. సిక్కు మహిళను అతను అత్యాచారం చేశాడు. నిందితుడు ఈ విషయాన్ని కోర్టులో చెప్పాడు. ప్రస్తుతం బర్మింగ్‌హామ్ క్రౌన్ కోర్టులో వాదనలు జరుగుతున్నాయి. ఆ కేసులో శుక్రవారం అతనికి శిక్షను ఖరారు చేయనున్నారు. అత్యాచారం చేసే క్రమంలో మహిళను బూతులు తిట్టాడు. ముస్లిం అనుకుని ఆమెను వేధించినట్లు అంగీకరించాడు. 2025 అక్టోబర్‌లో వాల్‌సాల్ ఏరియాలో దాడి ఘటన జరిగింది. అత్యాచారం, దొంగతనం, బెదిరింపులు, దాడికి పాల్పడినట్లు అతను



ఒప్పుకున్నాడు. దాడి జరగడానికి ముందు బాధిత అమ్మాయికి, నిందితుడికి ఎటువంటి పరిచయం లేదని కోర్టు తేల్చింది. పనిప్రదేశం నుంచి బస్సు దిగి ఇంటికి వెళ్తున్న సమయంలో జాన్ ఆష్బీ ఆమెను వెంబడించాడు. ఓ కర్రతో అతను ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంట్లో శబ్ధం రావడంతో ఆ అమ్మాయి బాత్రూం డోర్ వేసుకున్నది. కానీ నిందితుడు జాన్ గట్టిగా ఆ డోర్‌ను నెట్టేసి లోపలికి ప్రవేశించాడు. రూమ్‌లో లైట్లు ఆర్పేసి.. తాను కేవలం సరదా కోసం ఇక్కడకు వచ్చినట్లు చెప్పాడు. ఆ తర్వాత కర్రతో ఆమెను కొట్టాడు. గొంతు నలిమాడు. బాత్‌టబ్‌లోకి నెట్టేశాడు. హాట్‌వాటర్‌ను ఆన్ చేశాడు. ఆ సమయంలో ఇస్లామోఫోబిక్ మాటలతో ఆ మహిళను తిట్టాడు. ముస్లిం అనుకుని ఆమెను తీవ్రంగా దుర్భాషలాడాడు. కానీ ఆమె సిక్కు మతస్థురాలని అతనికి తెలియదు. నగలు, మొబైల్ తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కొన్ని క్షణాల్లోనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. రెండు రోజుల వ్యవధిలో బర్మింగ్‌హామ్‌లోని పెర్రీ బార్ ఏరియాలో నిందితుడిని అరెస్టు చేశారు.

# చైనీయులకు భారత టూరిస్టు వీసాల పునరుద్ధరణ..

**న్యూఢిల్లీ ఏప్రిల్ 23 (మహాప్రభ )**
భారత్- చైనా దేశాల మధ్య దౌత్య సంబంధాల్లో గురువారం కీలక పరిణామం చోటుచేసుకుంది. గల్వాన్ లోయ లో ఘర్షణలు జరిగినప్పటి నుంచి గత ఐదారేళ్లుగా చైనా జాతీయుల కు నిలిపేసిన పర్యాటక వీసాలను పునరుద్ధరించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. 2020లో భారత్-చైనా సరిహద్దుల్లోని గల్వాన్ లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణలు జరిగాయి. అప్పటి నుంచి చైనా జాతీయులకు భారత్ టూరిస్ట్ వీసాల జారీని నిలిపేసింది. టూరిస్టు వీసాల జారీలో పొరుగుదేశంతో



ఉన్న సంబంధాలను సాధారణస్థితికి తీసుకురావడమే భారత ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది. అధికారిక సమాచారం ప్రకారం.. చైనా, హాంకాంగ్ పౌరులకు పర్యాటక వీసాలను జారీ చేయడం కోసం కేంద్ర హోంశాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. దౌత్య సంబంధాలను మెరుగుపరుచుకొనేందుకు గత ఏడాది నుంచి ఆంక్షల సడలింపు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఇరుదేశాల ఒప్పందంతో నేరుగా విమానాల రాకపోకలను పునరుద్ధరించారు. సుదీర్ఘకాలంగా నిలిచిపోయిన కైలాస మానససరోవర్ యాత్రను కూడా పునఃప్రారంభించారు.

# అమెరికాను వీడుతాం..

**-40 శాతం మంది భారతీయుల అభిప్రాయమిదే**
**-తాజా సర్వేలో వెల్లడి**

**వాషింగ్టన్, ఏప్రిల్ 23 (మహాప్రభ )**
ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో అమెరికాకు వెళ్లిన ప్రవాస భారతీయుల కలలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టింది మొదలు అక్కడి ప్రవాస భారతీయులకు కష్టాలు మొదలయ్యాయి. 40 శాతం మంది భారతీయ అమెరికన్లు ఆ దేశాన్ని వీడాలని భావిస్తున్నట్టు తాజా సర్వే ఒకటి వెల్లడించింది. అమెరికాలో భారత సంతతి ప్రజలు 52 లక్షల మంది నివసిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. వీళ్లందరిలో 'అమెరికా డ్రీమ్'



కనుమరుగు అవుతున్నదని సర్వే అభిప్రాయపడింది. ఈ మార్పునకు ప్రధాన కారణం అమెరికాలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ వాతావరణమే. 'కార్నెగీ ఎండోమెంట్' తాజా సర్వేలో భాగంగా.. 1,000 మంది నుంచి సేకరించిన అభిప్రాయాలు విశ్లేషించగా, అమెరికాను వీడాలని తరచూ ఆలోచిస్తున్నామని 14 శాతం మంది, అప్పుడప్పుడు ఆలోచించామని 26 శాతం మంది చెప్పారు. ప్రతి పది మందిలో ఆరుగురు (58 శాతం) అమెరికా రాజకీయాలతో విసిగిపోయామని చెప్పగా, 41 శాతం మంది వ్యక్తిగత భద్రతపై ఆందోళనతో ఉన్నట్టు సర్వే పేర్కొన్నది.

# ఇండియన్ ప్యాసింజర్స్‌కు ఫ్రాన్స్ గుడ్ న్యూస్.. అదేమిటంటే..!



**న్యూఢిల్లీ ఏప్రిల్ 23 (మహాప్రభ )**
భారత ప్రయాణికుల కు ఫ్రాన్స్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఫ్రాన్స్ మీదుగా ఇతర దేశాలకు వెళ్లే భారతీయులకు ఇక నుంచి ఎయిర్‌పోర్ట్ ట్రాన్సిట్ వీసా అవసరం లేదని ప్రకటించింది. ఈ కొత్త నిబంధన ఏప్రిల్ 10వ తేదీ నుంచే అమల్లోకి వచ్చిందని భారత్‌లోని ఫ్రాన్స్ రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో స్పష్టంచేసింది. కొత్త నిబంధన ప్రకారం.. సాధారణ పాస్‌పోర్ట్ ఉన్న భారతీయ పౌరులు ఫ్రాన్స్‌లోని విమానాశ్రయాల్లో వేచి ఉండి, అక్కడి నుంచి మూడో దేశానికి వెళ్లేటప్పుడు ట్రాన్సిట్ వీసా మినహాయింపు వర్తిస్తుంది. అయితే ప్రయాణికులు విమానాశ్రయంలోని అంతర్జాతీయ జోన్ దాటి బయటకు రాకూడదు. కేవలం లేఓవర్ సమయంలో ఎయిర్‌పోర్ట్‌లో ఉండే వారికి మాత్రమే ఈ సౌలభ్యం అందుబాటులో ఉంటుంది. కాగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ భారత పర్యటన సందర్భంగా.. భారతీయులకు ప్రయాణ నిబంధనలు సులభతరం చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీకి అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏప్రిల్ 9న ఫ్రాన్స్ అధికారిక గెజిట్‌లో ఇందుకు సంబంధించిన సవరణ ఉత్తర్వులను ప్రచురించారు. ఈ మార్పులకు అనుగుణంగా అధికారిక ఫ్రాన్స్-వీసాస్ ప్లాట్‌ఫామ్‌లో సమాచారాన్ని కూడా అప్‌డేట్ చేసినట్టు రాయబార కార్యాలయం తెలిపింది. ఈ నిర్ణయంతో ఫ్రాన్స్ మీదుగా యూరప్, అమెరికా వంటి దేశాలకు వెళ్లే వేలాది మంది భారతీయులకు ప్రయాణం మరింత సులభతరం కానుంది.

# ఇరాన్‌కు ప్రయాణాలు వద్దు

**-భారత పౌరులకు అడ్వైజరీ**



**టెహ్రాన్,ఏప్రిల్ 23 (మహాప్రభ )**
భారత పౌరులెవ్వరూ ఇరాన్‌కు వాయు మార్గంలో కానీ, రోడ్డు మార్గంలో కానీ వెళ్లవద్దని భారత విదేశాంగ శాఖ తాజా అడ్వైజరీ జారీ చేసింది. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతుండటంతో ఇరాన్-భారత్ మధ్య విమాన సర్వీసులు పాక్షికంగా పునరుద్ధరించిన క్రమంలో టెహ్రాన్‌లోని భారత ఎంబసీ ఈ అడ్వైజరీ జారీ చేసింది. అంతేకాకుండా ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయులు నిర్దేశిత భూ సరిహద్దు మార్గాల ద్వారా ఇరాన్‌ను విడిచి వెళ్లాలని, ఈ క్రమంలో వారి కోసం రెండు ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపింది. సరిహద్దు దాటే పౌరులు కచ్చితంగా భారత దౌత్య కార్యాలయంతో సమన్వయం చేసుకోవాలని కోరింది.

# గాజాపై ఇజ్రాయిల్ దాడి

**- ముగ్గురు చిన్నారులతో సహా ఐదుగురు మృతి**



**గాజా ఏప్రిల్ 23 (మహాప్రభ )**
ఉత్తర గాజాపై తాజాగా ఇజ్రాయిల్ సైన్యం చేసిన వైమానిక దాడిలో ఐదుగురు మృతి చెందారు. ఈ విషయాన్ని గాజా పౌర రక్షణ సంస్థ వెల్లడించింది. బైత్ లాహియాలోని అల్--ఖస్సాం మసీదు సమీపంలో పౌరుల సమూహాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ముగ్గురు పిల్లలతో సహా ఐదుగురు పాలస్తీనియన్లు మరణించారు" అని స్థానిక ఆరోగ్య అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతదేహాలను గాజా నగరంలోని అల్--షిఫా ఆసుపత్రికి తరలించారు. అయితే అందులో మృతి చెందిన చిన్నారుల వయసును ఆరోగ్య అధికారులు ప్రకటించలేదు. కాగా, గడచిన రెండేళ్లుగా జరుపుతున్న పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు చేస్తూనే ఉంది. ఈ దాడుల్లో అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 20 వేల మందికి పైగా పాలస్తీనా చిన్నారులు మృతి చెందారు.

# భార్యను ఇంటికి పంపేందుకు నిరాకరణ..

**-అత్త వారింటికి నిప్పుపెట్టిన వ్యక్తి**

**ముంబై ఏప్రిల్ 23 (మహాప్రభ )**
పుట్టింట్లో ఉంటున్న భార్యను పంపేందుకు అత్తింటి వారు నిరాకరించారు. దీంతో ఆగ్రహించిన వ్యక్తి వారి ఇంటికి నిప్పుపెట్టాడు. వేసవి కావడంతో ఆ మంటలు వ్యాపించి పొరుగువారి ఇల్లు కూడా



కాలిపోయింది. మహారాష్ట్రలోని నందుర్బార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. భర్త మిథున్ పద్వీతో గొడవ కారణంగా అతడి భార్య కొంతకాలంగా పుట్టింట్లో నివసిస్తున్నది. కాగా, తన భార్యను తిరిగి తీసుకెళ్లేందుకు మిథున్ పలుమార్లు అత్తమామల ఇంటికి వెళ్ళాడు. అయితే ప్రతిసారీ ఆమెను అతడితో పాటు పంపడానికి వారు నిరాకరించారు. పదేపదే ఇలా జరుగడంతో మిథున్ తీవ్ర ఆగ్రహం చెందాడు. అత్తమామల ఇంటికి నిప్పుపెట్టి పారిపోయాడు. మరోవైపు వేసవి కావడంతో మంటలు తీవ్రమయ్యాయి. క్షణాల్లోనే పొరుగున నివసించే సుభాష్ వాల్వీ ఇంటికి కూడా మంటలు వ్యాపించాయి. మంటలు ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆ రెండు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ నేపథ్యంలో అత్త ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పారిపోయిన మిథున్ కోసం వెతుకుతున్నారు.

# బెంగాల్లో ఇక అధికారం బిజెపిదే

మొదటి తరువాయి

కమలం గుర్తుపై ఓటేయండి. ఇది మీరు కేవలం ఎవరో ఒకరిని ఎమ్మెల్యేని చేసేందుకో, భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికో కాదు.. చొరబాటుదారుల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించడానికి. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక బెంగాల్‌లోకి ఎవరూ చొరబడలేరు. ఇప్పటికే అక్రమ వలసదారులను భాజపా బయటకు పంపిస్తోందని అన్నారు. మరోవైపు, బెంగాల్‌లో జరుగుతున్న తొలి విడత ఎన్నికల్లో భారీగా పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 3గంటల సమయానికి 78.77శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 16 జిల్లాల పరిధిలోని 152 నియోజకవర్గాల్లో ఈ రోజు ఉదయం 7గంటలకు పోలింగ్ మొదలైన విషయం తెలిసిందే. చివరి వార్తలు అందేసరికి బెంగాల్లో 79శాతం ఓటింగ్ నమోదైనట్లు తెలుస్తోంది.

# నేటినుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

- తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం
- ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి



హైదరాబాద్,

తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవుల సందడి మొదలైంది. పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం 23తో ప్రస్తుత విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి విరామం ప్రారంభం కానుంది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం, ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు సెలవులు కొనసాగుతాయి. దాదాపు 50 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత, జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు నిర్వహించేవారు, కానీ ఈసారి ఎండలు తీవ్రమవుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే సెలవులు ప్రకటించారు. విద్యా సంవత్సరం చివరి రోజైన గురువారంతో తరగతులు ముగియనుండటంతో, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఒక ముఖ్యమైన ఆదేశాన్ని జారీ చేసింది. అన్ని ప్రభుత్వ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు , కేజీబీవీలలో 'తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం' నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలను అందజేయడమే కాకుండా.. వేసవి కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చర్చించారు. వరుస పరీక్షల ఒత్తిడి తర్వాత విద్యార్థులకు ఈ 50 రోజుల సెలవులు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. అయితే ఎండలు ఎక్కువగా ఉన్నందున, పిల్లలు బయట తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. మొత్తానికి సందడి, కేరింతల మధ్య పిల్లల వేసవి విడిది రేపటి నుంచే ప్రారంభం కాబోతోంది. అయితే ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లాలనుకున్న వారికి తీవ్రనిరాశ ఎదురయ్యింది. సమ్మెతో ఊళ్లకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సమ్మె ముగిస్తేనే ఎక్కడికైనా వెళ్లడానికి అవకాశం ఉంటుంది.

# వాంఖడేలో సీఎస్కే విజయ గర్జన..

మొదటి తరువాయి

ప్రారంభమైన కాసేపటికే ముంబై పీకల్లోతు కష్టాల్లో పడింది. రోహిత్ శర్మ గైర్హాజరీలో తుది జట్టులోకి వచ్చిన దానిష్ మలేవర్ (0) మరోసారి నిరాశపరిచాడు. సూపర్ ఫామ్‌లో ఉన్న నమన్ ధీర్ (0), క్వింటన్ డికాక్ (7) సైతం తొలి 3 ఓవర్లలోనే పెవిలియన్ చేరిపోయారు. దీంతో 11 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి.. ముంబై పీకల్లోతు కష్టాల్లో పడింది.సూర్యకుమార్ యాదవ్ (30 బంతుల్లో 36 రన్స్), తిలక్ వర్మ (29 బంతుల్లో 37 రన్స్) ఎక్కువ సేపు క్రీజులో ఉన్నా.. ధాటిగా రన్స్ చేయలేకపోయారు. ఆఖర్లో భారీ షాట్లకు ప్రయత్నించి ఔటై పోయారు. హార్దిక్ పాండ్యా (1), షెర్ఫాన్ రూథర్ ఫోర్డ్ (0) కూడా విఫలం కావడంతో ముంబై ఓటమి ఖరారైపోయింది. చివరకు ముంబై ఇండియన్స్.. సరిగ్గా 19 ఓవర్లలో 104 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో ముంబై ఇండియన్స్‌పై చెన్నై సూపర్ కింగ్స్.. 103 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఐపీఎల్‌లో పరుగుల పరంగా సీఎస్కేకు ఇదే అతిపెద్ద విజయం కావడం గమనార్హం.ఈ మ్యాచ్ విజయంతో చెన్నై సూపర్ కింగ్స్ ఈ టోర్నీలో మూడో గెలుపును రుచి చూసింది. 103 పరుగుల తేడాతో గెలవడంతో భారీగా నెట్ రన్ రేట్ కూడా దక్కింది. దీంతో పాయింట్స్ టేబుల్‌లో సీఎస్కే.. 8వ ప్లేసు నుంచి 5వ స్థానానికి ఎగబాకింది. ముంబై ఇండియన్స్.. ఏడు మ్యాచులలో కేవలం 2 విజయాలు మాత్రమే సాధించింది. 8వ ప్లేసులో నిలిచింది.

# కుబేర భారతం

మొదటి తరువాయి

దేశంలోని బిలియనీర్ల సంఖ్య రాబోయే ఐదేండ్లలో 51 శాతం పెరిగి 313కు చేరుకోనుంది. 2026 ప్రారంభంలో 207గా ఉన్న ఈ సంఖ్య.. 2031 నాటికి భారీగా పెరగనుంది. ఈ వృద్ధి రేటు ప్రపంచ ఆర్థిక శక్తులైన చైనా (20 శాతం), అమెరికా (12 శాతం) కంటే ఎంతో ఎక్కువగా ఉండటం గమనార్హం. కేవలం బిలియనీర్లే కాకుండా సుమారు రూ.250 కోట్ల కంటే ఎక్కువ ఆస్తి ఉన్న అల్ట్రా రిచ్ వ్యక్తుల సంఖ్య కూడా మన దేశంలో 25,217కు చేరుకుంటుందని ఈ నివేదిక అంచనా వేస్తోంది. ప్రస్తుతం ప్రపంచ బిలియనీర్లలో భారత్ వాటా 6.7 శాతంగా ఉండగా.. 2031 నాటికి ఇది 8 శాతానికి పెరుగుతుందని అంచనా. ఇప్పటికే 914 మంది బిలియనీర్లతో అమెరికా, 485 మందితో చైనా మొదటి రెండు స్థానాల్లో ఉండగా, 207 మందితో భారత్ ప్రపంచంలోనే మూడవ స్థానంలో నిలిచింది. గడిచిన ఐదేండ్లలో సగటున ప్రతి రోజూ 89 మంది అల్ట్రారిచ్ జాబితాలో చేరారు. సాధారణంగా 30 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.250కోట్లు) కంటే ఎక్కువ నికర సంపద కలిగిన వారిని అల్ట్రా రిచ్‌గా పిలుస్తారు. 2021లో ప్రపంచవ్యాప్తంగా ఈ అల్ట్రా రిచ్ వ్యక్తుల సంఖ్య 5.51లక్షలుగా ఉండగా.. ప్రస్తుతం 7,13,626కు పెరిగింది. కాగా.. భారత్‌లో ప్రస్తుతం 19,877 అల్ట్రా రిచ్ వ్యక్తులు ఉండగా.. వచ్చే ఐదేండ్లలో ఈ సంఖ్య 25,217కు చేరనుంది. ఈ జాబితాలో భారత్ ప్రపంచవ్యాప్తంగా ఆరో స్థానంలో ఉంది. ధనవంతులు తమ సంపదను కేంద్రీకరించడానికి రియల్ ఎస్టేట్‌ను ప్రధాన మార్గంగా ఎంచుకుంటున్నారు. ప్రతి అత్యంత ధనవంతుడు సగటున 3.7 నివాసాలను కలిగి ఉన్నాడు. వారి మొత్తం సంపదలో 21 శాతం వాటా కమర్షియల్ రియల్ ఎస్టేట్‌లోనే ఉంది. దేశంలో ఒకవైపు బిలియనీర్ల సంఖ్య పెరుగుతుంటే.. మరోవైపు సామాన్యుడి ఆదాయాలు ద్రవ్యోల్బణం దెబ్బకు కరిగిపోతున్నాయి. నివాస స్థలాల ధరలు పెరగడం వల్ల ప్రధాన నగరాల్లో సాధారణ ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోంది. దేశ వృద్ధి రేటు గణాంకాల్లో కనిపిస్తున్నప్పటికీ దాని ఫలాలు అట్టడుగు వర్గాలకు అందడం లేదని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంపద కేవలం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవ్వడం వల్ల సమాజంలో ఆర్థిక అంతరాలు మరింత పెరుగుతున్నాయని అనేక రిపోర్టులు వెల్లడిస్తున్నాయి.

# ఇరాన్ నౌకలను కాల్చిపారేయండి

మొదటి తరువాయి

కాని ట్రంప్ నుంచే దాడి చేయలంటూ ఆదేశాలు రావడం గమనార్హం. మరోవైపు అమెరికా నిర్భందం కొనసాగుతున్నంత కాలం హార్మూజ్ జలసంధిని తెరిచే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇప్పటికే ఈ యుద్ధంతో హార్మూజ్ జలసంధి ఉద్రిక్త ప్రాంతంగా మారిపోయింది. అలాగే ఇరాన్ సముద్రంలో అమర్చిన సిమైన్స్ తీయడం అంత సులభం కాదని, వాటిని తీసేందుకు కనీసం 6 నెలల సమయం పడుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే 35 కి.మీ వెడల్పు ఉండే హార్మూజ్ జలసంధి కోసం అగ్రరాజ్యం అల్లాడిపోవడం, అనేక దేశాల్లో చమురు ధరలుపై ప్రభావం పడటం ఈ జలసంధి ప్రాముఖ్యతను తెలుపుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు..

# ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే మాకు ముఖ్యం

మొదటి తరువాయి

కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, సంస్థ పరిరక్షణ ప్రకారమే పనిచేస్తున్నామని, క్యాబినెట్ లో మంత్రులంతా కార్మికులకు అనుకూలంగా చర్చించారన్నారు. కాగా, ఆర్టీసీలో పనిచేసే ప్రతి కార్మికుడికి మంత్రి శ్రీధర్ బాబు కూడా కీలక విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలు, ధర్నాలపై క్యాబినెట్ లో కీలకంగా చర్చించామని తెలిపారు. కార్మికులు సంయమనంతో ఉండాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తప్పకుండా చర్యలు చేపడుతుందన్నారు. అంతవరకూ ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని, ఎవ్వరూ ప్రాణాలు తీసుకోవద్దని కోరారు. ఇలాంటి ఆలోచనలు చేయవద్దన్నారు.

కష్టపడి రాష్ట్రాన్ని సాధించుకున్నది ఇలా ఆత్మహత్యలు చేసుకునేందుకు కాదన్న విషయం గుర్తుంచుకోవాలని, క్షణికావేశంతో కుటుంబాలకు అన్యాయం చేయవద్దన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంపై నమ్మకం ఉంచాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల బృందం నేడు శుక్రవారం ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులను చర్చలకు ఆహ్వానించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో తెలంగాణ క్యాబినెట్ సమావేశం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు మొదలై సాయంత్రం వరకు భేటీ అయింది. రాష్ట్రంలోని తాజా పరిణామాలతో



పాటు ఆర్టీసీ సమ్మె సహా పలు కీలక అంశాలపై మంత్రివర్గం హాట్ హాట్ గా చర్చించింది. కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు, ఆర్టీసీ కార్మికుల సమ్మె ప్రభుత్వంలో విలీనం అంశాలపై చర్చించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలుతో పాటు నీటిపారుదల ప్రాజెక్టుల అంశాలు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై చర్చించినట్లు చెబుతున్నారు. అలాగే ఫిట్ మెంట్, పెండింగ్ డీఏలు, యాసంగి ధాన్యం, మొక్కజొన్నల సేకరణపై క్యాబినెట్ లో చర్చ జరిగిందని తెలుస్తోంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోనే కీలక ప్రకటన చేశారు. గురువారం నాటి క్యాబినెట్ భేటీలో ఆర్టీసీ సమ్మెపై చర్చ జరిగిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాదని.. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో దృష్టి పెట్టిందని సీఎం ప్రకటించారు.

**కాళేశ్వరం తీర్పుపై సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం**

కాళేశ్వరం ప్రాజెక్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాళేశ్వరం తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని ఏజీకి సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తయ్యాయని, తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు క్యాబినెట్ వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై న్యాయస్థానంలో పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లోనూ, పాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్.ఏ జోషిలపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో పలు నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదిక ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది.


# రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె

మొదటి తరువాయి

తెల్లవారుజాము నుంచే బస్సుల వద్దకు చేరి ఒక్క బస్సును కూడా కదలనీయలేదు. పోలీసులు బలవంతంగా ఆర్టీసీ కార్మికులను అరెస్ట్ చేసినా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు అధిక ధరలు చెల్లించ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. మెదక్ ఆర్టీసీ డిపో నుంచి ఈరోజు తెల్లవారుజామున బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నం చేయగా కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. గురువారం తెల్లవారుజామున ఆర్టీసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య బస్సులు నడిపేందుకు డిపో నుంచి బస్టాండ్ వరకు బస్సులు తీసుకురాగా కార్మికులు సమాచారం తెలుసుకొని భారీ సంఖ్యలో చేరుకొని అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సులను అడ్డుకోవడంతో పోలీసులు కార్మికులను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9డిపోల్లో 600 వందల బస్సులు నిలిచి పోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగుతున్నది. కామరెడ్డి జిల్లాలో ఆర్టీసీ కార్మికుల టెంట్‌ను పోలీసులు తొలగించడంతో వివాదం చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండో రోజు బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్ డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికులు డిపోల ఎదుట ధర్నా చేపట్టారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో బస్సులు నడుపాలని చూడగా ఆర్టీసీ కార్మికులు అడ్డుకున్నారు. మహబూబా బాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులపై పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారు. రెండో రోజు సమ్మె కొనసాగు తుండగా తొర్రూరు డిపో వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. విధులకు రాని 21 మంది కార్మికులపై కేసు నమోదు చేశారు. సమ్మెలో పాల్గొనేందుకు డిపో వద్దకు వస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయడంపై ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# పోటెత్తిన ఓటర్లు

మొదటి తరువాయి




బెంగాల్‌లో మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాలు 294 కాగా, రెండోదైన చివరి విడత పోలింగ్ 142 స్థానాలకు ఏప్రిల్ 29న జరుగుతుంది. పోలింగ్ సరళిని చూస్తే అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), ప్రతిపక్ష బీజేపీకి మధ్య హోరాహోరీ పోరు జరిగినట్లు తెలుస్తోంది. బెంగాల్ మొదటి విడత ఎన్నికల్లో 1478 మంది అభ్యర్థులు పోటీ చేశారు. బెంగాల్ ఎన్నికల్లో మరోవైపు హింస చెలరేగింది. ముర్షిదాబాద్‌లో టీఎంసీ కార్యకర్తలు ఏయూజేపీ పార్టీ చీఫ్ హుమాయున్ కబీర్‌పై దాడులు చేశారు. సిలిగురిలో టీఎంసీ, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. కుమార్‌గంజ్‌లో బీజేపీ అభ్యర్థి సువేందు సర్కార్‌పై టీఎంసీ గుండాలు దాడికి పాల్పడ్డారు. మరోవైపు, ఈ ఓటింగ్ చూస్తే ఎస్ఆర్ప్ ప్రక్రియ, ఓట్ల తొలగింపుపై ప్రజల కోపాన్ని సూచిస్తోందని ఇది టీఎంసీకి అనుకూలమే అని సీఎం మమతా బెనర్జీ కామెంట్ చేసింది. మరోవైపు, మే 4 టీఎంసీకి గుడ్ బై అంటూ బీజేపీ చెబుతోంది. మరోవైపు, తమిళనాడులో ఒకే విడతలో మొత్తం 234 స్థానాలకు ఓటింగ్ జరిగింది. సాయంత్రం 5 గంటల వరకు ఆ రాష్ట్రంలో 82.24 శాతం ఓటింగ్ నమోదైంది. గంటగంటకు పోలింగ్ పెరుగుతుండటంతో అధికార వ్యతిరేక ఓటింగ్ నమోదవుతున్నట్లు రాజకీయ నిపుణులు చెబుతున్నారు. తమిళనాడులో అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకేతో పాటు విజయ్ టీవీకే పార్టీల మధ్య త్రిముఖ పోరు నెలకొంది. ఎండల్ని లెక్కచేయకుండా తమిళ ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# తన గూడు తానే నిర్మించుకునే కప్ప

మొదటి తరువాయి



ఇది ఈ ప్రాంతంలోని ఉభయచరాల వైవిధ్యాన్ని, పర్యావరణ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తున్నది. గూడు కట్టుకొని దాంట్లో నివసించటమన్నది కప్పల్లో అరుదైన, సరికొత్త విషయంగా సైంటిస్టులు పేర్కొంటున్నారు.

## బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో

# భాజపాదే విజయం

మొదటి తరువాయి

షాక్ ఇచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. టిఎంసి చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం, మహా జంగల్ రాజ్ ను పోత్సహిస్తోందని మోడీ ఆరోపించారు. బెంగాల్ లో బిజెపి అధికారంలోకి వస్తే మతువా, నమశూద్ర వర్గాలకు ఆశ్రయం కల్పిస్తామని మోడీ కృష్ణానగర్లో జరిగిన ఎన్నికల ర్యాలీలో హామీనిచ్చారు.. ఈ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'మీరు బిజెపి- ఎన్డిఎ విజయ పతాకాన్ని ఎగురవేయాలి. మే 4న బెంగాల్లో బిజెపి విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తారు. ఝుల్మురిని కూడా అందజేస్తారు. ఝుల్మురి కొంతమందికి పిడుగులాంటి షాక్ ఇచ్చింది. నేను ఝుల్మురి తిన్నాను. కానీ ఆ ఝల్ (మసాలా) టిఎంసిని తాకింది' అని అన్నారు. బెంగాల్ ప్రజలు టిఎంసి పాలనను వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కమ్యూనిస్టులను వ్యతిరేకించారు. ఇప్పుడు టిఎంసి జంగిల్ రాజ్ కి వ్యతిరేకంగా నిలబడ్డారు. దీనికి అణచివేతదారులు, అవినీతిపరులే జవాబుదారీగా ఉంటారు. మా మంత్రం సబ్కా సాథ్, సబ్కా వికాస్ అని మీకు తెలుసు. మే 4వ తేదీ తర్వాత పశ్చిమ బెంగాల్లో సుపరిపాలనకు కొత్త హామీ ప్రారంభం కానుందని అన్నారు. మతువా సమాజం, నమశ్రూద సమాజం, శరణార్థి కుటుంబాలు టిఎంసికి భయపడాల్సిన పనిలేదు. మీకు ఎవరు హానీ చేయలేరు. ఆశ్రయం, గౌరవం కోరుతూ భారతదేశానికి వచ్చిన వారందరికీ తాను అండగా నిలుస్తారని మోడీ హామీనిచ్చారు. బెంగాల్లో ఏర్పడే బిజెపి ప్రభుత్వం సిఎఎ కింద పౌరసత్వం మంజూరు చేసే పక్రియను వేగవంతం చేస్తోందని మోడీ అన్నారు. దేశంలోని ప్రతి భారత పౌరుడికి దక్కాల్సిన ప్రతి హక్కు, ప్రయోజనం మీకు లభిస్తుందని మోడీ హామీనిచ్చారు. నేడు బెంగాల్లో మొదటి దశ ఎన్నికలు జరుగుతున్నాయి. నేడు తమిళనాడులో కూడా జరుగుతున్నాయి. ఓటర్లందరికీ శుభాకాంక్షలు. ఈసారి ప్రతి ఒక్కరూ కొత్త ఓటింగ్ రికార్డులు సృష్టించాలని మోడీ ఓటర్లను కోరారు. బెంగాల్ లో గత 50 ఏళ్లలో హింసను కనిష్ట స్థాయికి పరిమితం చేసిన మొదటి ఎన్నిక ఇదే అని మోడీ చెప్పారు. లేకపోతే, ఇక్కడ ప్రతి వారం ఎవరో ఒకరిని ఉరితీయడం, దానిని ఆ తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించడం చేసేవారు. ఒకరకమైన గూండాల పాలన ప్రబలింది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరోసారి నిలబెట్టినందుకు ఎన్నికల సంఘానికి తాను హృదయపూర్వక అభినందలు తెలిపారు.

# కాళేశ్వరంపై రెండో రోజూ సంబురాలు..

మొదటి తరువాయి



కొత్తపల్లి మండల కేంద్రంలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రంలోని డీ8 కెనాల్ వద్ద కాళేశ్వర జలాలతో కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరి సురేశ్ అభిషేకం చేశారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంబురాలు నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పటాకులు కాల్చారు.

# గొట్టిముక్కలలో పోషణ పక్షం విజయవంతం

**-ఐ సి డి ఎస్, సూపర్వైజర్. డి. చిట్టెమ్మ**



**దేవరకొండ ఏప్రిల్ 23( మహాప్రభ )**
అంగన్వాడీ కేంద్రశీ నందు పోషణ పక్షం ప్రోగ్రాం నిర్వహించారు , ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ డి చిట్టెమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా పోషక విలువలు కలిగినటువంటి ఆహార పదార్థాలు ప్రతినిత్యం తీసుకోవాలి అని వివరించారు, ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు మరియు పిల్లలు సిరి , మరియు చిరు ధాన్యాలతో పాటుగా మన పరిసరాలలో దొరికే కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు తప్పకుండా తీసుకోవాలి అని తెలియజేశారు . అలాగే వేయి రోజుల ప్రాముఖ్యత ,మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసులో పిల్లల మెదడు 90 శాతం అభివృద్ధి జరుగుతుంది కాబట్టి ఈ వయసులో పిల్లలకు ఎక్కువ అవకాశాలు కల్పించాలి అప్పుడే వారి అభివృద్ధి కుంటూ పడకుండా ఉంటుందని తెలియజేశారు . అలాగే డిసిపియు యూనిట్ మెంబర్ అంజలి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి, బాల్యవివాహాలు చేయడం ద్వారా తల్లిదండ్రులకు మరియు ప్రోత్సహించే అటువంటి వారికి ఎలాంటి శిక్షలు పడతాయి అని వివరించారు, తల్లిదండ్రులు లేని అనాథ బాలలకు మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన కలిపించడం అక్రమంగా పిల్లలను దత్తత తీసుకోవడం ఇవ్వడం చట్టరీత్య నేరం అన్ని తెలిపరిచారు, గ్రామ సర్పంచ్ ఎరుకలి పార్వతీ వెంకటేష్ మాట్లాడుతూ ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరినీ అంగన్వాడికి పంపించాలని గర్భిణీ బాలింతలు ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రానికి వచ్చి భోజనం చేయాలని అంగన్వాడి కేంద్రాల్లో ఇచ్చే బాలామృతం, బాలామృతం ప్లేసు,ఎగ్స్ అర్హులైన వారు తీసుకోవాలని తెలిపారు. వాళ్లు వినియోగించుకోవాలని గవర్నమెంట్ నుంచి వచ్చే బెనిఫిట్స్ తప్పకుండా వినియోగించుకోవాలని తెలిపారు అలాగే ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో MLHP

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ ఏప్రిల్ 23 ( మహాప్రభ ) దేవరకొండ**
మండలంలోని రత్య తండాలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై, ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి, ఇంటి యజమానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి అర్హులైన కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని తెలిపారు. ఇల్లు ప్రతి కుటుంబానికి పెద్ద ఆస్తి అని, ఇలాంటి పథకాల ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో సంతోషం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గౌసియా బేగం భౌతిక కాయానికి నివాళులర్పించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ ఏప్రిల్ 23( మహాప్రభ )**
పట్టణంలోని 4వ వార్డు కౌన్సిలర్ రైయిస్ తల్లి గౌసియా బేగం మరణించిన విషయం తెలుసుకొని వారి స్వగృహంలో గౌసియా బేగం భౌతిక కాయానికి నివాళులర్పించి,బాధిత కుటుంబానికి పరామర్శించి,వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,వారి ఆత్మ శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు అనంతరం శివాజీ నగర్ కాలనీకి చెందిన మారేపల్లి విజయ భాస్కర్ ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తదనంతరం 3వ వార్డుకు చెందిన మహమ్మద్ జహంగీర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారితో పాటు ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కౌన్సిలర్లు,ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మండే ఎండలో ప్రజలకు ఊరటనిచ్చే చలివేంద్రం ఏర్పాటు



**శేరిలింగంపల్లి ఏప్రిల్ 23(మహాప్రభ )**
మియాపూర్ డివిజన్ పరిధిలోని డీమార్ట్ సమీపంలో మండే ఎండల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు చల్లని తాగునీటి చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని శ్రీరంగాపురం కాలనీ ప్రెసిడెంట్ మరియు జనసేన పార్టీ నాయకుడు కేశవరావు సిళ్ళ ఆధ్వర్యంలో స్థానిక మిత్రబృందం నిర్వహించింది. ఈ చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మరియు చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ తన బృందంతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు నాయకులు పరస్పరం శాలువాలు కప్పుకుని సత్కరించుకున్నారు. అనంతరం ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ, 'వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహాన్ని తీర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మేలు చేయడం మన కర్తవ్యంగా భావించాలి. ప్రతి కాలనీ, ప్రతి వీధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి 'సేవే మా ధర్మం' అనే సందేశాన్ని విస్తరించాలి" అని పిలుపునిచ్చారు. మండే ఎండల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రం ఏర్పాటు చేయడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూర్తి, ప్రసాద్, కిషోర్, సతీష్, గురువులు తదితరులు, పలువురు నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంతాపాన్ని వ్యక్తం చేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్



**దేవరకొండ ( డివిజన్) 23 ఏప్రిల్ మహాప్రభ**
గన్యానాయక్ తండలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నేనావత్ దస్లీ గారి అకాల మరణం ఆ కుటుంబంలో తీరని లోటును మిగిల్చింది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ గురువారం వారి స్వగ్రామానికి చేరుకుని, దహన సంస్కారాల్లో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషన్ నాయక్ మాట్లాడుతూ, వారి మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ, మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించడమే కాకుండా, తన వంతు సామాజిక బాధ్యతగా కిషన్ నాయక్ ఆ కుటుంబానికి 10,000/- రూపాయల తక్షణ ఆర్థిక సాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో కూడా ఆ కుటుంబానికి అండగా ఉంటానని, ఏ అవసరం వచ్చినా ఆదుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు తండ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని మృతురాలికి కన్నీటి వీడ్కోలు పలికారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్



**దేవరకొండ డివిజన్ ఏప్రిల్ (23) మహాప్రభ**
దేవరకొండ బాలుర వసతి గృహం ( ఏ 1) లో పెరెన్సి మీటింగ్ జరిగినది వార్డెన్ అహ్మద్ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఆయన ఆరో తరగతి నుండి 9వ తరగతి వరకు ఒక నెల రోజులు క్యాంపుకు ఆయనక్యాంపు కు మహబూబ్ నగర్ క్యాంపు ఉంటుందని క్యాంపులో స్టడీ భోజనం దుస్తులు వారే చూసుకుంటారని వార్డెన్ తల్లిదండ్రులను కోరారు

# అయ్యర్పల్లి పీపీసీ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలి: కలెక్టర్**





**కామారెడ్డి ఏప్రిల్ 23 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ , గురువారం రోజున లింగంపేట మండలం అయ్యర్పల్లి గ్రామంలోని ఐకేపీ పీపీసీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో నేరుగా మాట్లాడి, కొనుగోలు కేంద్రంలో వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తూకం, తేమ శాతం పరీక్ష, గన్నీ బ్యాగుల లభ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వరి సేకరణకు సంబంధించిన సివిల్ సప్లైస్, మార్కెటింగ్, ఐకేపీ, పీఏసీఎస్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి. కొనుగోలు ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలి" అని అధికారులను ఆదేశించారు. "కొనుగోలు చేసిన వెంటనే రైతులకు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలి. దీని కోసం ప్రతి రోజు జరిగే కొనుగోళ్ల వివరాలను అదే రోజు ఓ పి ఎం ఎస్, ట్యాబ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి. నమోదులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు" అని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరపాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# లింగంపేట గురుకులంలో ప్రగతి పత్రాల పంపిణీ

**-తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యార్థుల అభివృద్ధి:**
**-జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**






**కామారెడ్డిఏప్రిల్ 23(మహాప్రభ)**
లింగంపేటలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల మరియు కళాశాలలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, విద్యార్థుల ప్రగతి పత్రాలను తల్లిదండ్రులకు అందజేశారు. విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. గురుకులాల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు బోధిస్తున్న ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. భవిష్యత్తులో కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రగతి పత్రాల ఆధారంగా విద్యార్థుల బలాలు, బలహీనతలను గుర్తించి మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, ఎంపీడీఓ, ఆర్సీఓ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు ఆర్&బి శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి రాక




**దేవరకొండ ఏప్రిల్ 23( మహప్రభ)**
దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లెపల్లి మండలంలోని కోల్ ముంతల్ పహాడ్ గ్రామ సమీపం రైతు వేదిక వద్ద లియంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనుల శంకుస్థాపనకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్‌డబి శాఖ మంత్రి వర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డివిచ్చ్చయుచున్నారు. కావున దేవరకొండ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ఆయా మండలాల ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయ గలరని ఎమ్మెలే నేనవత్ బాలు నాయక్ తెలిపారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ నాయకులు వడ్త్య రమేష్




**దేవరకొండ ఏప్రిల్ 23( మహాప్రభ )**
నియోజకవర్గంలోని డిండి మండలం గోనబోయాన పల్లి కి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు రమణయ్య కూతురు వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన –దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ ఈ కార్యక్రమంలో దీ=గా పార్టీ మండల అధ్యక్షులు రాజీనైని వెంకటేశ్వర్ రావు. విష్ణు వర్ధన్ రెడ్డి. గుర్రం రాములు. మాజీ సర్పంచ్ వెంకటేష్. డిండి ఉప సర్పంచ్ రసీద్. విజయ్. గుర్రం సురేష్. వెంకటయ్య. ఎల్లయ్య. రమేష్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు...

# పారదర్శకత జనగణన కు లక్ష్యంగా తాసిల్దార్లు చిత్తశుద్ధితో పని చేయాలి.

**-జిల్లాలో చెరువులు అన్యక్రాంతం కాకుండా డ్రైలాండ్- వెట్ ల్యాండ్ సర్వే నిర్వహణలో ముందుచూపు అవసరం.**
**-ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రజలకు ప్రయాణానికి అసౌకర్యం కలవకుండా పటిష్ట చర్యలు.**



**మెదక్ జిల్లా -23ఏప్రిల్ (మహాప్రభ )**
సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో సమావేశ మందిరంలో గూగుల్ మీటి నిర్వహించి సంబంధిత కాసిల్దారులకు జనగణన, డ్రైలాండ్ వెట్ ల్యాండ్ సర్వే, ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రజలకు ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా తీసుకునే చర్యలు వచ్చే ఖరీఫ్ సీజన్లో రైతులకు విత్తనాలు పురుగు మందులు కొరత లేకుండా బఫర్ స్టాక్ ఏర్పాటు చేయడం, జిల్లాలో ధాన్యం కొనుగోలు సమర్ధవంతంగా నిర్వహణకు, సమర్థ ఓ టర్ మ్యాపింగ్, గృహ అవసరాల గ్యాస్ కొరత లేకుండా చూడటం, భూభారతి సాదా బైనామా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, సంబంధిత అంశాలపై డీఎఫ్ఓ జోజి, డిఆర్డిఓ శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ , డి ఎం జగదీష్ ,డిపిఓ యాదయ్య, పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, సిపిఓ సురేష్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, డి ఎం ఆర్టీసీ సురేఖ, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సంబంధిత తాసిల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జన గణనకు సంబంధించి తాసిల్దార్లు ప్రతి అంశంలో స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని. క్షేత్రస్థాయిలో జనగణనకు సంబంధించి ప్రత్యక్షంగా ఎదుర్కొనే అంశాలను ప్రశ్నలు సమాధానాల రూపంలో అడిగి తెలుసుకున్నారు. జనగణనకు శిక్షణ అనేది చాలా ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. జిల్లాలో సమర్థ జన గణనే లక్ష్యంగా ముందుకు పోవాలన్నారు. జిల్లాలో 606 చెరువుల సంరక్షణలో భాగంగా. డ్రైలాండ్ వెట్ ల్యాండ్ ఈ సర్వే వేగవంతం చేయాలని. సెంట్రల్ గవర్నమెంట్ నిధులు వచ్చే అవకాశం ఉన్నందున రెవెన్యూ, ఫారెస్ట్ ఇరిగేషన్ సమన్వయంతో కమిటీ ఏర్పాటు చేసి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు
ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే వానాకాలానికి రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు సమర్ధవంతంగా నిర్వహించాలని ఇప్పటివరకు జిల్లాలో 525 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందని143 మంది రైతులు నుండి
11 కొనుగోలు కేంద్రాల ద్వారా 887 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. గన్ని బ్యాగులకు సంబంధించి ఎటువంటి కొరత లేదన్నారు. మిల్లర్లు కూడా సహకరిస్తున్నారని వివరించారు. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ విషయంలో వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా అవసరానికి తగ్గట్టుగా నిల్వలు ఉంచుకొని తద్వారా చర్యలు చేపట్టాలన్నారు.
భూభారతి-సాదా బైనామా పెండింగ్ దరఖాస్తులపై కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతిలో గల వివిధ మాడ్యూల్స్ లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా తదితరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు..జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా (సింపుల్ సేల్ డీడ్స్ )సాదాబైనామా పరిష్కారంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలిలివారికి ఇచ్చిన లక్ష్యాల మేరకు త్వరితగతిన పరిష్కరించాలన్నారు.
పారదర్శకంగా ఎస్ఐఆర్ (యస్ ఐ ఆర్ )మ్యాపింగ్ ప్రక్రియలి కొనసాగాలని,జిల్లాలో ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ఓటర్లను చేర్చడం, తప్పుగా నమోదైన వివరాలను సరిచేయడం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.
బీఎల్వోలు (బి యల్ ఓ యస్ )తమ పరిధిలో ఇంటింటి సందర్శనలు నిర్వహించి, ఓటర్ల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, పేర్లలో ఉన్న తప్పులను సరి చేయాలని తెలిపారు. ముఖ్యంగా అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఉన్న డేటాను సమగ్రంగా సమీక్షించాలన్నారు.మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి, జిల్లాలో వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు ..
.ఈ కార్యక్రమంలో సంబంధిత తాసిల్దారులు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలే లక్ష్యం.

**తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి.**

**మెదక్ జిల్లా 23ఏప్రిల్ (మహాప్రభ )**
రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు.గురువారం మెదక్ జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో విత్తన డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులు, ఎఫ్‌పీఓలు (ఎఫ్ పి ఓ యస్ )మరియు ఏఆర్ఎస్‌కే (ఎ ఆర్ యస్ కె )కేంద్రాల ప్రతినిధులతో నిర్వహించిన విస్తృత స్థాయి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ నేరుగా రైతులతో అనుసంధానమై, వారి ద్వారానే విత్తన ఉత్పత్తి చేపడుతుందని చైర్మన్ తెలిపారు. సేకరించిన విత్తనాలను కఠినమైన ప్రమాణ పరీక్షల అనంతరం ధృవీకరించి మాత్రమే రైతులకు అందజేస్తున్నామని అన్నారు. దీనివల్ల రైతులకు నాణ్యతపై పూర్తి భరోసా ఉంటుందని వివరించారు. వానకాలం సీజన్‌కు విత్తనాలు సిద్ధం ప్రస్తుత వానకాలం (ఖరీఫ్) సీజన్‌కు సంబంధించి జిల్లాలో విత్తనాల కొరత లేదని ఆయన స్పష్టం చేశారు.




**సన్న రకాలు:** బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638.
**దొడ్డు రకాలు:** కెఎన్ఎం 118, ఎమ్‌టియు 1010.
పై రకాల విత్తనాలు నిల్వలో సమృద్ధిగా ఉన్నాయని, ప్రభుత్వం సూచించిన రకాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని ఆదేశించారు.
పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలను కూడా సకాలంలో రైతులకు అందజేస్తామని పేర్కొన్నారు. సహకార సంఘాల పాత్రపై సూచనలు సహకార సంఘాలు, ఏఆర్ఎస్‌కే కేంద్రాలు కేవలం రాయితీ ఉన్న పచ్చిరొట్ట విత్తనాలపైనే కాకుండా, ఇతర పంటల విత్తనాలను కూడా రైతులకు అందించడంలో చొరవ చూపాలని కోరారు. లైసెన్స్ కలిగిన ప్రతి విత్తన డీలర్ విత్తనాభివృద్ధి సంస్థ ఉత్పత్తులను తప్పనిసరిగా విక్రయించాలని సూచించారు. మెదక్ జిల్లా సాగు అంచనాలు మెదక్ జిల్లాలో ఈ సీజన్‌లో సుమారు 3.20 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా వేస్తున్నామని, అందుకు 82 వేల క్వింటాళ్ల విత్తనం అవసరమని తెలిపారు. ఇందులో కనీసం 40 వేల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం ద్వారా సరఫరా చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే నూతన విత్తన చట్టం ద్వారా రైతుల హక్కులతో పాటు, డీలర్ల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం కాపాడుతుందని అన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విత్తనాలను రైతులు కొనుగోలు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని విత్తన సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.?ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి నిత్యానంద్ , జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పి ప్రభాకర్ రెడ్డి ఏడీఏలు, ఎంఏఓలు, జిల్లా సహకార అధికారి (డి సి ఓ )విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు, విత్తన డీలర్లు మరియు ఎఫ్‌పీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అప్పుల భారం తట్టుకోలేక యువకుడి ఆత్మహత్య

**తాడ్వాయి ఏప్రిల్ 23 (మహాప్రభ)**
తాడ్వాయి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గండ్ల స్వరూప కుమారుడు గండ్ల శ్రీకాంత్ (22) అప్పుల భారం తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం... కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, తల్లి వైద్య చికిత్స కోసం సుమారు రూ.2.5 లక్షలు అప్పులు చేయడంతో శ్రీకాంత్ గత కొంతకాలంగా తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యాడు. ఈ క్రమంలో ఆయన తల్లి హైదరాబాద్‌లో తన కుమార్తె వద్దకు వెళ్లగా, 22-04-2026 సాయంత్రం ఇంట్లో ఒంటరిగా ఉన్న శ్రీకాంత్ ఇనుప రాడుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై తాడ్వాయి ఎస్ఐ వై. నరేష్ కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.




## గురు పీఠంలో విశేష పూజలు...

**శివంపేట,ఏప్రిల్ 23 (మహాప్రభ):**
శివంపేట్ మండలంలోని గూడూరు గ్రామంలో గల గురు పీఠంలో వైశాఖ శుద్ధ సప్తమి గురువారం పురస్కరించుకుని శ్రీ దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం గురుపరంపర దేవాలయం లో మరియు శ్రీ శిరిడి సాయిబాబా దేవాలయంలో శ్రీ శాస్తుల శ్రీనివాస్ శివ శర్మ శ్రీ మహా దత్తాత్రేయ స్వామి అభిషేక శతనామా అష్టోత్తర అర్చనము హారతి సమర్పించడమైనది.అదేవిధంగా అష్టోత్తర అర్చన తదినంతరం కాకడ ఆరతి తదనంతరం మహాభిషేకము షిరిడి సాయిబాబా పంచలోహ మూలమూర్తి అభిషేకము శతనామ అష్టోత్తర అర్చన అనంతరం ఆరతి సమర్పించడం అయినది.ఈరోజు శ్రీ గురు పీఠం సమన్వయకర్త కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్-ఉదయ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వారిని గురు పీఠం వ్యవస్థాపకులు మరియు చైర్మన్, హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం పెద్ద గౌని శివకుమార్ గౌడ్ పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపి వారిని సన్మానించారు. పెళ్లిరోజు సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ మరియు మహా నైవేద్య ప్రసాద వితరణ శ్రీ కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్ శ్రీమతి ఉదయ దంపతులు నిర్వహించారు. ఈనాటి పూజా కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు విచ్చేసి శ్రీ దత్తాత్రేయ మహాస్వామి ఆశీస్సులు పొందడం జరిగినది.ఈ కార్యక్రమంలో విశ్రాంత జిల్లా పరిషత్ హెడ్మాస్టర్ రమణా రెడ్డి గారు, గూడూరు కొత్త కుమ్మరి శ్రీకాంత్, నానుతాండవాసులు,నర్సాపూర్ శివంపేట గూడూరు గ్రామస్తులు పాల్గొని బాబా ఆశీస్సులు పొంది కోశీతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్ దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.



## నూతన వధు వరులను ఆశీర్వదించిన మాజీ డిప్యూటీ స్పీకర్ యం.పద్మ దేవేందర్ రెడ్డి.



**మెదక్ జిల్లా 23ఏప్రిల్ (మహాప్రభ )**
పాపన్నపేట మండలం నాయకులు కోడపాక గ్రామానికి చెందిన బెజుగం శంకర్ గుప్తా కుమార్తె శ్రావణి వివాహం శ్రీమాన్ తో మెదక్ జిల్లా కేంద్రంలోని వినాయక కన్వెన్షన్ హాల్లో అంగరంగ వైభవంగా జరిగింది.ఈ వివాహానికి మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు ఎం పద్మ దేవేందర్ రెడ్డి,పార్టీ శ్రేణులతో కలసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శు భాకాంక్షలు తెలిపారు.వీరి వెంట పాపన్నపేట మండల మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కుమ్మరి.జగన్,కొడపాక సర్పంచ్ కాశీనాథ్ రావు, ఆరెపల్లి మాజీ సర్పంచ్ శ్రీనాథ్ రావు, నాయకులు సోములు, వెంకటేశం,రఘు,లింగా రెడ్డి,పాపన్నపేట మండల నాయకులు మాజీ సర్పంచ్ లు తదితరులు ఉన్నారు.

## జాతీయ స్థాయి సేపక్ తక్రా పోటీలకు పోతంగల్ కలాన్ క్రీడాకారిణి



**గాంధారి, ఏప్రిల్ 23 (మహా ప్రభ)**
గాంధారి మండలలోని పోతంగల్ కలాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని అబ్దుల్ అలియా నిత్యము ఉదయం మరియు సాయంత్రం పాఠశాల ఆవరణలో సేపక్ తక్రా నైపుణ్యాలను పట్టుదలతో నిరంతరం సాధన చేస్తూ జిల్లా జట్టు తరుపున ప్రాతినిత్యం వ్యవహరించి సేపక్ తక్రా క్రీడలో తనదైన ముద్ర వేసుకున్న అబ్దుల్ అలియా మహబూబాబాద్ జిల్లా లో జరిగిన ఎస్, జి, ఎఫ్,యు,/14 రాష్ట్ర స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి సేపక్ తక్రా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు తెలిపారు. తెలంగాణ రాష్ట్రము లోని మహబూబాబాద్ లో ఈ నెల ఏప్రిల్ 24 నుండి 28 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్ర జట్టు తరుపున కెప్టెన్ గా వహిస్తుంది. అని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. రంగారావు తెలిపారు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయ బృందం గ్రామసర్పంచ్ అనుశ్రీ, బాల్ రాజు, ఉప సర్పంచ్ సంజీవ్ రెడ్డి, గ్రామస్తులు, యువకులు, అభినందించారు.

## బస్టాండ్ల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్త్.

**-ఆర్టీసీ సేవలు అంతరాయం లేకుండా కొనసాగాలి**
**-ఎస్పీ డి . వి. శ్రీనివాస రావు ఐపీఎస్.**



**మెదక్ జిల్లా 23ఏప్రిల్ (మహాప్రభ)**
టీజీఎస్ఆర్టీసీ జేఏసీ సమ్మె నేపథ్యంలో మెదక్ జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ప్రజా రవాణా సేవలు నిరంతరంగా కొనసాగేందుకు భద్రతా చర్యలను బలోపేతం చేసింది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. డిపో మేనేజర్ సురేఖతో మాట్లాడిన ఎస్పీ, ప్రస్తుతం నడుస్తున్న బస్సుల సంఖ్య, సేవల స్థితిగతులను తెలుసుకున్నారు. సమ్మె ఉన్నప్పటికీ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా రవాణా సేవలు సజావుగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బస్టాండ్ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రైవేట్ డ్రైవర్లు, సిబ్బంది భయపడాల్సిన అవసరం లేదని, వారికి పూర్తి భద్రత కల్పిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. ప్రజా రవాణాకు ఆటంకం కలిగించే చర్యలు, బస్సులకు నష్టం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసాన్ని సహించబోమని హెచ్చరించారు. అటువంటి ఘటనలు జరిగితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా ఎస్పీ వెంట డియస్పీ ప్రసన్న కుమార్, డిపో మేనేజర్ సురేఖ, సీఐలు మహేష్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పౌల్ట్రీ ఫారంలో పేకాట గూడు భగ్నం



**తాడ్వాయి, ఏప్రిల్ 23 (మహాప్రభ)**
తాడ్వాయి గ్రామ శివారులోని పౌల్ట్రీ ఫారంలో నిర్వహిస్తున్న మూడు కార్డుల జూదాన్ని పోలీసులు భగ్నం చేశారు. ఎం.డి. గౌస్‌కు చెందిన కోళ్ల ఫారం షెడ్లో పేకాట జరుగుతోందన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ వై. నరేష్ సిబ్బందితో కలిసి తెల్లవారుజామున దాడి నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులు డబ్బులు పెట్టి పేకాట ఆడుతూ రంగేహస్తంగా పట్టుబడ్డారు. నిందితులు సయ్యద్ రఫీఖ్ ఉద్దీన్, మహ్మద్ ముజాహిద్ అలీ, మీర్ మజీద్ అలీ, సయ్యద్ మహబూబ్ అలీగా గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.4,300 నగదు, 52 ప్లేయింగ్ కార్డులు, 4 మొబైల్ ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పౌల్ట్రీ ఫారం యజమాని ఎం.డి. గౌస్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, సయ్యద్ రఫీఖ్ ఉద్దీన్ ఆరు నెలల క్రితం కోళ్ల ఫారాన్ని లీజుకు తీసుకుని, అక్కడ పేకాట నిర్వహిస్తూ డబ్బులు వసూలు చేసి, అందులో భాగంగా యజమానికి అదనపు మొత్తాన్ని చెల్లించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తాడ్వాయి ఎస్ఐ వై. నరేష్ తెలిపారు.

# బిజినెస్

## బంగారం కొనే వారికి సూపర్ గుడ్‌న్యూస్..
## జస్ట్ 4 గంటల్లోనే భారీగా తగ్గిన ధరలు, తులం ఎంతంటే?

పశ్చిమాసియా ఉద్రిక్తల మధ్య బంగారం, వెండి ధరల్లో వరుస హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. తాజాగా గురువారం ఉదయం 6గంటల నుంచి 10 గంటల మధ్య అంటే జస్ట్ 4 గంటల్లోనే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై ఏకంగా రూ.1200పైగా తగ్గింది. అటు వెండి కూడా రూ.5వేలు దిగొచ్చింది. కాబట్టి ప్రస్తుతం హైదరాబాద్ సహా దేశ వ్యాప్తంగా ఉన్న బంగారం, వెండి ధరలు పరిశీలిద్దాం.భారీ హెచ్చుతగ్గుల తర్వాత ప్రస్తుతం హైదారబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,550 వద్ద కొనసాగుతుండగా ఉదయం 6గంటలకు ఈ ధర 1,54,740గా ఉంది. అంటే కేవలం 4 గంటల్లోనే తులం బంగారంపై ఏకంగా రూ.1200పైగా దిగొచ్చింది. ఇక 22 క్యారెట్ల బంగారం విషయానికి వస్తే ఉదయంతో పోల్చుకుంటే దీని ధర రూ.1100 తగ్గింది. ప్రస్తుతం 22 క్యారెట్ల బంగాం ధర రూ.1,40,750 వద్ద కొనసాగుతుంది.ఇక ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర



రూ.1,53,550గా ఉండగా ఉదయం ఈ ధర రూ. 1,54,740గా ఉంది. ఇక 22 క్యారెట్ల బంగాం ధర రూ.1,40,750 వద్ద కొనసాగుతుంది. ఇక్కడే కాదు దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాలైన ముంబై, పూణె, బెంగళూరులోనూ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ధరలే కొనసాగుతున్నాయి.ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,700 వద్ద కొనసాగుతుండగా ఉదయం 6గంటలకు ఈ ధర 1,54,890 గా ఉంది. అటు చెన్నైలోనూ తులం బంగారం ధర రూ.1,54,480 వద్ద కొనసాగుతుంది. ఇక్కడితో పోల్చుకుంటే తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు తక్కువగా ఉంటాయి. ఎందుకంటే బంగారం దిగుమతి చేసుకున్న తర్వాత, దానిని ఓడరేవుల నుండి దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలించడానికి రవాణా ఖర్చులు అవుతాయి. ఢిల్లీ సముద్ర తీరానికి దూరంగా ఉండటం వల్ల, అక్కడికి బంగారాన్ని సురక్షితంగా చేరవేయడానికి రవాణా, ఇన్సూరెన్స్ ఖర్చులు అదనంగా తోడవుతాయి. దీని వల్ల ఇక్కడ రేట్లు ఎక్కువగా ఉంటాయిఇక వెండి విషయానికి వస్తే వెండి కూడా బంగారం తరహాలోనే ముందుకెళ్తోంది. గడిచిన రెండ్రోజులతో పోల్చుకుంటే వెండి ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.2,70,000 ఉంది. ఉదయంతో పోల్చుకుంటే ఈ ధర రూ.5000 వేల వరకు తగ్గింది. ఇక దేశీయ మార్కెట్‌లో మాత్రం ఈ ధర రూ.2,60,000 వద్ద కొనసాగుతుంది. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఎప్పికప్పుడూ మారుతూ ఉంటాయి. కాబట్టి కచ్చితమైన ధరలు తెలుసుకునేందుకు సమీపంలోని గోల్డ్‌షాప్ లేదా సంబంధిత వెబ్‌సైట్‌లను సందర్శించండి

## స్టాక్ మార్కెట్లు పతనం..

**852 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్.. 205 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**




భారతీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా నష్టాలు చవిచూశాయి. గురువారం బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 852 పాయింట్లు, నిఫ్టీ 205 పాయింట్లు నష్టపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ 852.49 పాయింట్లు (1.09 శాతం) నష్టపోయి 77,664 వద్ద ముగిసింది. నిఫ్టీ 205.05 పాయింట్లు (0.84శాతం) నష్టపోయి 24,173.05 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభమైనప్పటి నుంచి మార్కెట్లు ఒత్తిడిలోనే కొనసాగాయి.నిఫ్టీ 24,202.35 పాయింట్లతో ప్రారంభంకాగా, ఇంట్రాడేలో 24,134.80 పాయింట్ల కనిష్టానికి చేరింది. ఇరాన్–అమెరికా మధ్య శాంతి చర్చల అంశంలో స్పష్టత లేకపోవడం, హార్ముజ్ దిగ్బంధనం, అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరగడం వంటి అంశాలు మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, ట్రెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్ స్టాక్స్ భారీగా నష్టపోయాయి. అదానీ పోర్ట్స్, బీఈఎల్, సన్ ఫార్మా, ఎల్‌అండ్‌టీ, భారతీ ఎయిర్‌టెల్ సంస్థలు లాభాలు పొందాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నాయి. బ్యారెల్ క్రూడాయిల్ ధర 103 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఔన్స్ బంగారం ధర 4688 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరింత పడిపోయింది. 94 మార్క్ దాటి 94.10 వద్ద కొనసాగుతోంది. బుధ, గురు వారాలు కలిపి సెన్సెక్స్ 1,600 పాయింట్లు (2 శాతం) నష్టపోయింది. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ షేర్లు భారీగా నష్టపోయాయి.

## టెస్లా మరో మాడల్ ఆగయా

**-సింగిల్ చార్జింగ్‌తో 681 కిలోమీటర్లు**
**-ప్రారంభ ధర రూ.61.99 లక్షలు**

అమెరికాకు చెందిన విద్యుత్ కార్ల తయారీ సంస్థ టెస్లా..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆరుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ వైఎల్ మాడల్ ధర రూ.61.99 లక్షలుగా నిర్ణయించింది. ఇప్పటికే విడుదల చేసిన వై మాడల్‌కు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన రావడంతో ఈ నూతన మాడల్‌ను పరిచయం చేసింది. 5 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగం అందుకోనున్న ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 681 కిలోమీటర్ల మైలేజీ




ఇవ్వనున్నది. ప్రీమియం ఎస్‌యూవీ వాహన విభాగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో ఈ నయా మాడల్‌ను తీసుకొచ్చినట్టు టెస్లా ఇండియా జనరల్ మేనేజర్ శరద్ అగర్వాల్ తెలిపారు.

**హైదరాబాద్‌లో షోరూం..**

టెస్లా హైదరాబాద్‌లో షోరూంను ఏర్పా టు చేయడానికి ముందుకొచ్చింది. ఇప్పటికే ఢిల్లీ, ముంబై, గురుగ్రామ్ నగరాల్లో మూడు ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను నిర్వహిస్తున్న సంస్థ..వచ్చే మూడు నెలల్లో హైదరాబాద్‌తోపాటు బెంగాల్, చెన్నై, అహ్మదాబాద్‌లలో షోరూంలను ప్రారంభించనున్నట్టు ప్రకటించింది. మెర్సిడెజ్ బెంజ్ విడుదల చేసిన ఈక్యూఎస్ మాడల్‌కు పోటీగా టెస్లా ఈ నూతన కారును ప్రవేశపెట్టింది.

## ఐపీఎల్ పాయింట్స్ టేబుల్‌లో పంజాబ్ హవా

ఐపీఎల్ మ్యాచ్‌లు క్రికెట్ ఫ్యాన్స్‌కు మస్త్ మజాను అందిస్తున్నాయి. ఫోర్లు, సిక్సర్లతో బ్యాట్స్‌మెన్లు హోరెత్తిస్తుంటే.. అదిరిపోయే బంతులతో బౌలర్లు దుమ్ములేపుతున్నారు. మొదట్లో బ్యాట్స్‌మెన్ పూర్తి ఆధిపత్యం చెలాయించగా.. ఇప్పుడు బౌలర్ల హవా మొదలైంది. బుధవారం లక్నోలోని ఎకానా క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌లో బౌలర్ల హవా కొనసాగింది. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్.. ఆరు వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. అనంతరం లక్నో జట్టు 18 ఓవర్లలో కేవలం 119 పరుగులకే ఔట్ అయింది. ఇప్పటివరకు అన్ని జట్లు ఆరు మ్యాచ్‌లు ఆడేయగా.. కొన్ని జట్లు 7 మ్యాచ్‌లు కూడా ఆడేశాయి. పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో కూడా దూసుకెళ్తోంది. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఐదు విజయాలు సాధించగా.. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. 11 పాయింట్లతో టాప్ ప్లేస్‌లో నిలిచింది. లక్నోపై విజయంతో రాజస్థాన్ రాయల్స్ రెండోస్థానానికి చేరింది. 7 మ్యాచ్‌ల్లో ఐదు విజయాలు సాధించింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు మ్యాచ్‌ల్లో విజయం సాధించి.. 8 పాయింట్లతో మూడోస్థానంలో ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ 7 మ్యాచ్‌లు ఆడగా.. నాలుగు




విజయాలు సాధించింది. 8 పాయింట్లతో నాలుగోస్థానంలో ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ 5 మ్యాచ్‌లు ఆడగా.. మూడింట గెలుపొందింది. ఢిల్లీ ఖాతాలో ఆరు పాయింట్లు ఉండగా.. పాయింట్ల పట్టికలో ఐదోస్థానంలో ఉంది. గుజరాత్ టైటాన్స్ ఐదు మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో ఆరోస్థానంలో ఉంది. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్‌లో గెలుపొందిన ముంబై ఇండియన్స్.. ఆ తరువాత వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. చివరి మ్యాచ్‌లో గెలుపొంది రెండో విజయం ఖాతాలో వేసుకుంది. నాలుగు పాయింట్లో ఏడోస్థానంలో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఈ సీజన్‌లో కూడా ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. ఆరు మ్యాచ్‌లు ఆడగా.. కేవలం రెండు విజయాలతో 8వ స్థానంలో ఉంది. ఇక లక్నో సూపర్ జెయింట్స్ పర్ఫామెన్స్ మరీ తీసికట్టుగా ఉంది. ఏడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో కింది నుంచి రెండోస్థానంలో ఉంది. కోల్‌కతా నైట్ రైడర్స్ మాత్రం ప్లే ఆఫ్ రేసు నుంచి అన్ని జట్ల కంటే బాగా వెనుకపడిపోయింది. ఏడు మ్యాచ్‌ల్లో ఒకే విజయం సాధించింది. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. మూడు పాయింట్లతో చివరిస్థానంలో ఉంది. మిగిలిన 7 మ్యాచ్‌ల్లో కనీసం ఆరు మ్యాచ్‌లు గెలిస్తే ప్లే ఆఫ్ రేసులో ఉంటుంది. ఇప్పటివరకు ఈ సీజన్‌లో అత్యధిక పరుగులతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ టాప్‌లో ఉన్నాడు. 7 మ్యాచ్‌ల్లో 323 పరుగులతో ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గా ఉన్నాడు. హెన్రిచ్ క్లాసెన్ (283), శుభ్‌మన్ గిల్ (265) రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. లక్నో బౌలర్ ప్రిన్స్ యాదవ్ 13 వికెట్లతో పర్పుల్ హోల్డర్‌గా ఉన్నాడు. ఆ తరువాతి స్థానాల్లో అన్షుల్ కాంబోజ్ (13), ఈషాన్ మలింగ (12) ఉన్నారు.

# స్పోర్ట్స్

## ధోనీ వల్లే స్టేడియాలు పసుపు మయం


**చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్**




దిగ్గజ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ వల్లే తాము ఎక్కడికి వెళ్లినా స్టేడియాలు పసుపు మయం అవుతున్నాయని చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అన్నాడు. దురదృష్టవశాత్తు ఆయన ఆడటం లేదని, కానీ ఈ క్రేజ్ సృష్టికర్త ధోనీనే అని స్పష్టం చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో వాంఖడే వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో సీఎస్‌కే టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన రుతురాజ్ గైక్వాడ్‌ను ముంబైలో సీఎస్‌కే క్రేజ్ గురించి హోస్ట్ ప్రశ్నించాడు. ధోనీ వల్లే ఈ క్రేజ్ అని గైక్వాడ్ బదులిచ్చాడు. టాస్ గెలిస్తే తాము కూడా బౌలింగ్ ఎంచుకోవాలనుకున్నామని గైక్వాడ్ తెలిపాడు. 'మేం కూడా ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం. కానీ ఇది 50–50 నిర్ణయమే. పిచ్ బాగుంది. వాంఖడేలో ముందుగా బ్యాటింగ్ చేసినా.. బౌలింగ్ చేసినా మెరుగైన ప్రదర్శన కనబర్చడం ముఖ్యం. కాబట్టి మొదట బ్యాటింగ్ చేసినా సరే అద్భుతమైన ప్రదర్శన ఇవ్వడం కీలకం. మేం మెరుగైన ప్రదర్శనే చేస్తున్నాం. కానీ కీలక సమయాల్లో అవకాశాలను చేజార్చుకుంటున్నాం.గత మ్యాచ్‌లో మా బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. బ్యాటింగ్‌లో కూడా మంచి ఆరంభం లభించింది. కానీ కీలక సమయంలో తడబడి విజయాన్ని చేజార్చుకున్నాం. జట్టులో అందరూ ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. మా దిగ్గజం ధోనీ వల్లే మేం ఎక్కడికి వెళ్లినా అభిమానుల మద్దతు లభిస్తోంది. స్టేడియాలు పసుపుమయం అవుతున్నాయి. దురదృష్టవశాత్తూ ధోనీ ఈ మ్యాచ్ ఆడటం లేదు. కానీ ఇదంతా ఆయన సృష్టించిన ప్రభావమే. ఈ రాత్రి మా అభిమానులను సంతోషపరుస్తామని ఆశిస్తున్నాను. మా జట్టులో రెండు మార్పులు ఉన్నాయి.'అని రుతురాజ్ గైక్వాడ్ తెలిపాడు. మరోవైపు టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా బౌలింగ్ ఎంచుకున్నాడు. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. గత మ్యాచ్ తరహాలోనే మెరుగైన ప్రదర్శన చేసి విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఆటను ఆస్వాదించాలని మా కుర్రాళ్లకు చెప్పానన్నాడు. కోల్‌కతాతో మ్యాచ్ తరహాలోనే ఈ పిచ్ ఉందని, ఆ మ్యాచ్ తరహాలోనే లక్ష్యాన్ని ఛేదిస్తామని చెప్పాడు.

## ఐపీఎల్‌లో ఆడేందుకు మిచెల్ స్టార్క్ వచ్చేస్తున్నాడు..

ఐపీఎల్‌లో ఆడేందుకు ఆస్ట్రేలియా మేటి బౌలర్ మిచెల్ స్టార్క్ కు ఆ దేశ క్రికెటర్ బోర్డు క్లియరెన్స్ ఇచ్చింది. ఇక ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుతో అతను త్వరలో కలవబోతున్నాడు. మే ఒకటో తేదీన రాజస్థాన్ రాయల్స్‌తో జరగనున్న మ్యాచ్‌లో.. స్పీడ్‌స్టర్ మిచెల్ స్టార్క్ ఆడే అవకాశాలు ఉన్నాయి. మోచేయి, భుజం నొప్పి కారణంగా జనవరి నుంచి స్టార్క్ క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన యాషెస్ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డును గెలుచుకున్న విషయం తెలిసిందే. స్టార్క్ మళ్లీ తన పంజా విసరనున్నాడని, 2026 ఐపీఎల్ సీజన్‌లో అతను ఆర్ఆర్‌తో జరిగే మ్యాచ్‌లో ఆడే ఛాన్సు ఉన్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించింది.ఐపీఎల్‌లో ప్రారంభ మ్యాచ్‌లకు విదేశీ ఆటగాళ్లు కొందరు దూరం కావడం వివాదాస్పదమైంది. అయితే తనకు గాయమైనట్లు స్టార్క్ ఇటీవల తన ఇన్‌స్టాలో




పేర్కొన్నాడు. గత ఏడాది ఐపీఎల్‌లో ఢిల్లీ తరపున స్టార్క్ 11 మ్యాచ్‌లు ఆడి 14 వికెట్లు తీసుకున్నాడు. ఇప్పటి వరకు ఢిల్లీ ఈ సీజన్‌లో పాయింట్ల పట్టికలో అయిదో స్థానంలో ఉన్నది. మూడు ఓటములు, మూడు గెలుపులు ఉన్నాయి. ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ కూడా ఐపీఎల్‌లో ఆడనున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు అతను త్వరలో తొలి మ్యాచ్ ఆడే ఛాన్సు ఉన్నది.

# అంతర్జాతీయ వేదికపై 'వారణాసి'..

## మెక్సికో CCXPలో గ్రాండ్ ఎంట్రీ!




ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న పాన్-వరల్డ్ మూవీ 'వారణాసి' తన తొలి గ్లోబల్ ప్రెజెంటేషన్ కోసం సిద్ధమైంది. మెక్సికోలో ఏప్రిల్ 24న జరగనున్న జజశూ 2026 ఈవెంట్‌లో ఈ సినిమా కోసం ఒక ప్రత్యేకమైన ప్యానెల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సినిమాకు సంబంధించిన ఎక్స్‌క్లూజివ్ 'బిహైండ్ ది సీన్స్' వీడియోలను ప్రదర్శించడమే కాకుండా, సినిమా మేకింగ్ విశేషాలను చిత్ర బృందం అక్కడి ప్రేక్షకులతో పంచుకోనుంది. ఈ వేడుకలో దర్శకుడు రాజమౌళితో పాటు చిత్రయూనిట్ పాల్గోనబోతున్నట్లు సమాచారం. ఇక ఈ భారీ ఈవెంట్‌లో పాల్గొనడం ద్వారా 'వారణాసి' సినిమా అంతర్జాతీయ స్థాయి ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించినట్లయింది. ప్రెజెంటేషన్ ముగిసిన తర్వాత చిత్ర బృందం అక్కడి ఆడియన్స్‌తో నేరుగా ఇంటరాక్ట్ అవ్వడం ఈ ప్యానెల్ యొక్క ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఇండియన్ కల్చర్ మరియు మైథాలజీని గ్లోబల్ ఆడియన్స్‌కు కొత్తగా పరిచయం చేయనున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

# రాకా మూవీలో దీపికదే కీ రోల్

## ఆమె నటించదన్న వార్తలపై టీమ్ స్పందన




అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీస్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమాలో బన్నీకి జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తున్నారు. ఇటీవల ఆమె రెండోసారి తల్లి కానున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమాపై రూమర్స్ మొదలయ్యాయి. షూటింగ్ ఆలస్యం అవుతుందని.. దీపిక స్థానంలో మరో నటిని తీసుకోనున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వాటిని 'రాకా' టీమ్ ఖండించింది. సినిమాలో దీపిక పాత్ర నిడివి తగ్గించారనే ప్రచారాన్ని కూడా కొట్టేసింది. సినిమాలో ఆమె పాత్ర కీలకమైనదని షూటింగ్ కూడా అనుకున్న షెడ్యూల్స్ ప్రకారమే సాగుతోందని స్పష్టం చేసింది. రూమర్స్‌ను షేర్ చేయొద్దని విజ్ఞప్తి చేసింది. సన్ పిక్చర్స్ నిర్మిస్తోన్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో దీపిక కొన్ని క్రేజీ యాక్షన్ సన్నివేశాల్లోనూ నటించనున్నట్లు తెలుస్తోంది. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ ఆమె ఈ సీక్వెన్స్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమెతో పాటు మరికొందరు హీరోయిన్‌లు కూడా నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రష్మిక, జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా మాత్రం ఇంకా చిత్రబృందం వెల్లడించలేదు. ఇందులో ప్రధాన పాత్రల్లో ఎవరు అతిథి పాత్రల్లో ఎవరనే విషయంపై స్పష్టత రావడానికి మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని లుక్ కోసం అల్లు అర్జున్ రోజూ 3, 4 గంటలు సమయం వెచ్చిస్తున్నారని సినీవర్గాలు చెప్పాయి.

# విభిన్న థ్రిల్లర్ 'పరమపద సోపానం'





అర్జున్ అంబటి హీరోగా నటిస్తున్న చిత్రం 'పరమపద సోపానం'. నాగశివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గణపర్తి నారాయణరావు నిర్మిస్తున్నారు. ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శకులు భీమినేని శ్రీనివాసరావు, వీరశంకర్, సముద్ర ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.ఎన్ని అవరోధాలు ఎదురైనా టీమ్ అంతా ఈ సినిమా కోసం ప్రాణంపెట్టి పనిచేశామని, అన్ని వర్గాలను అలరించే కథ ఇదని దర్శకుడు నాగశివ తెలిపారు. తన కుమారుడు అర్జున్ అంబటికి సినిమానే జీవితమని, అతన్ని ప్రేక్షకులు ఆశీర్వదించాలని నిర్మాత గణపర్తి నారాయణరావు కోరారు. విభిన్నమైన కాన్సెప్ట్‌తో రూపొందిన థ్రిల్లర్ ఇదని హీరో అర్జున్ అంబటి తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ సినిమాకు సంగీతం: దేవ్ జాండ్.



# వరుస ఫ్లాప్‌లతో శ్రీలీల డిసప్పాయింట్

## హిట్‌లు లేకపోవడంతో కెరీర్‌లో ఒడిదుడుకులు

కన్నడ సినిమాలతో కెరీర్ ప్రారంభించి, టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటోంది. ప్రారంభంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని టాప్ హీరోయిన్ రేసులోకి వచ్చిన ఆమె ఇప్పుడు మాత్రం వరుస ఫలితాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు కనిపిస్తోంది. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లి సందడి' సినిమాతో శ్రీలీల టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా? ఆమెకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. మొదటి సినిమా ఎ÷-లాప్ అయినా కూడా, ఇండస్ట్రీలో ఆమెకు వరుస అవకాశాలు రావడం విశేషం. రవితేజ సరసన నటించిన 'ధమాకా' సినిమా బ్లాక్‌బస్టర్ కావడంతో శ్రీలీల కెరీర్ ఒక్కసారిగా టర్న్ అయింది. ఆ విజయంతో ఆమె టాలీవుడ్‌లో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. వరుసగా అరడజను సినిమాలు ఆమె చేతిలో పడగా, కొన్నింటి ఫలితాలు నిరాశపరిచాయి. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీలీల వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, పెద్ద హిట్ మాత్రం ఆమెకు దక్కలేదు. 'పుష్ప 2'లో చేసిన ప్రత్యేక డాన్స్ నంబర్‌తో ఇతర భాషల ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆమెకు తమిళ, హిందీ ఇండస్ట్రీల్లో అవకాశాలు కూడా వచ్చాయి. తమిళంలో చేసిన 'పరాశక్తి' సినిమా బాక్సాఫీస్ వద్ద విఫలమైంది. దీంతో అక్కడ ఆమెకు ఆశించిన గుర్తింపు రాలేదు. ఇక హిందీలో అనురాగ్ బసు దర్శకత్వంలో చేస్తున్న సినిమా ఆలస్యం అవుతుండటం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఆ ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తవుతుందో స్పష్టత లేకపోవడం గమనార్హం. ఇటీవల వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్'లో పవన్ కళ్యాణ్ సరసన నటించినా? సినిమాలో ఆమె పాత్రకు పెద్దగా గుర్తింపు రాలేదు. అదే సమయంలో గత ఏడాది వచ్చిన సినిమాలు కూడా కమర్షియల్‌గా పెద్ద విజయాలను అందుకోలేకపోయాయి. ప్రస్తుతం తెలుగులో పెద్దగా ప్రాజెక్టులు లేకపోవడంతో, శ్రీలీల తన భవిష్యత్తును బాలీవుడ్ సినిమాపైనే ఆధారపెట్టినట్టు కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఓ సినిమాలో ఆమెకు అవకాశం వచ్చిందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. సినీ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ సంవత్సరం శ్రీలీల కెరీర్‌కు అత్యంత కీలకం. కనీసం ఒకటి రెండు హిట్స్ సాధిస్తేనే ఆమె మళ్లీ టాప్ రేసులోకి రావచ్చని అంటున్నారు.




# రామాయణంలో రావణ, కుబేర యుద్ధం

## భారీ స్థాయిలో చిత్రీకరిస్తున్న దర్శకుడు

బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా రూపుదిద్దుకుంటున్న అత్యంత భారీ బ్జడెట్ చిత్రం 'రామాయణం' గురించి ఒక సంచలన వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా రామాయణం కథ అనగానే శ్రీరాముడి బాల్యం లేదా జననంతో మొదలవుతుందని మనందరికీ తెలుసు, కానీ ఈ చిత్రంలో దర్శకుడు నితీష్ తివారీ సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో రావణుడిగా నటిస్తున్న కన్నడ సూపర్ స్టార్ యష్ పవర్‌ఫుల్ ఎంట్రీతో, రావణ-కుబేర యుద్ధంతో ప్రారంభం కాబోతుందని తెలుస్తుంది. తన సోదరుడైన కుబేరుడిపై దాడి చేసి, స్వర్ణ లంకను మరియు పుష్పక విమానాన్ని రావణుడు స్వాధీనం చేసుకునే ఘట్టాన్ని అత్యంత భారీ స్థాయిలో వెండితెరపై చూపించబోతున్నట్లు సమాచారం. భారతీయ సినీ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా సుమారు 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఇందులో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ప్రత్యేక స్క్రీనింగ్‌లో ప్రదర్శించిన 20 నిమిషాల ఫుటేజీ చూసిన విశ్లేషకులు, ముఖ్యంగా లంకా నగరం మరియు రావణుడి యుద్ధ సన్నివేశాల్లోని ఘట్టాలు హాలీవుడ్ స్థాయిని మించి ఉన్నాయని ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. రావణుడి శక్తిని, ప్రతాపాన్ని చూపే ఈ విజువల్ స్పెక్టాకిల్ మొదటి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com